





PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ,రంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 07, ఎడిటర్,చెరుకు ఉపేందర్, పేజిలు : 8, వెల రూ. 5, సోమవారం - 09 - జూన్ - 2025

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని...
## రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాదులో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ




హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ఇటీవల నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా జరిగిన సంభాషణ వెల్లడించిన వైనం

## ఏపీ రాష్ట్ర చరిత్రలోనే భారీగా ప్రమోషన్లు..
## వైకాపా సానుభూతి ఉద్యోగులకు కూడా..

ఆన్‌లైన్ ద్వారా 4,853 పదోన్నతులు, 35,235 బదిలీలు విజయవంతంగా

2

పూర్తి చేసినట్లు విద్యాశాఖ ప్రకటన

"టీచర్ ట్రాన్స్‌ఫర్స్ యాక్ట్"ను అమల్లోకి

చట్టం ప్రకారం అన్ని బదిలీలను కేవలం ఆన్‌లైన్ ద్వారానే

## దేశంలో కోవిడ్ కలకలం.. ఆరు వేలు దాటిన యాక్టివ్ కేసులు




- దేశంలో కొత్తగా 1,131 కోవిడ్ కేసులు నమోదు
- దేశంలో ఆదివారం ఉదయం 8 గంటల నాటికి కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 6,133కి చేరుకుంది

## మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం ప్రధాని మోదీ




- కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది పూర్తి
- 11 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు
- "విద్యా, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర

# దత్తాత్రేయది పేరుకు హిందుత్వం
# మతం భారతీయం

★ అలయ్ బలయ్ అంటే జ్ఞాపకం వచ్చేది దత్తాత్రేయ

★ దత్తాత్రేయ కోరుకున్నది జనహితం ఆయనది లౌకికవాదం

★ హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ

★ రాజకీయాల్లో నీతి, నిజాయితీ సిద్ధాంతాలు ముఖ్యం: వెంకయ్య




హైదరాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయది పేరుకు హిందుత్వం మతం భారతీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలయ్ బలయ్ అంటే జ్ఞాపకం వచ్చేది దత్తాత్రేయ అని అభివర్ణించారు. దత్తాత్రేయ కోరుకున్నది జనహితం ఆయనది లౌకికవాదమని కొనియాడారు. లేఖలు రాయడంలో దత్తాత్రేయ అంబాసిడర్‌గా నిలిచారని సీఎం ప్రశంసించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమర (ఆదివారం) జరిగింది. 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో దత్తాత్రేయ పుస్తకం రచించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కిషన్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, ఏపీ గవర్నర్ నజీర్, ఏపీ మంత్రి సత్యకుమార్, పలు రాష్ట్రాల గవర్నర్లు, పలువురు కేంద్రమంత్రులు హాజరయ్యారు. .ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, మిగతా.. 2లో




## విజయవాడలో 'సెలూన్ కొనికి' ప్రారంభోత్సవం...
## షార్ట్ తో వచ్చిన పవన్ కల్యాణ్...


విజయవాడలో 'కొనికి' పేరుతో నూతన సెలూన్ ప్రారంభం

ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పాల్గొన్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

సెలూన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం విజయవాడలో సందడి చేశారు. నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన "కొనికి" అనే సెలూన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, యార్లగడ్డ వెంకట్రావు ఇరువురూ మిగతా.. 2లో




## కొత్త మంత్రులకు శుభాభినందనలు

**తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి...**

**ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే!**

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ నియామకం

- వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి మంత్రి పదవులు
- శాసనసభ ఉపసభాపతిగా రామచంద్రు నాయక్ నియామకం
- ఈ నలుగురు నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

## కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం ఏంటీ

- కాళేశ్వరం కమిషన్ విచారణపై ఈటల సంచలన వ్యాఖ్యలు
- కేబినెట్ లో చర్చించకుండా ప్రభుత్వంలో ఏమీ జరగదని వెల్లడి
- తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలను తిప్పికొట్టిన ఈటల



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం తనకు లేదని బీజేపీ నేత, తెలంగాణ మాజీ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన ఈటల.. కేసీఆర్ ను రక్షించేందుకే వాస్తవాలను దాచిపెట్టారన్న ఆరోపణలపై మాజీ మంత్రి స్పందించారు. ఆదివారం ,మిగతా.. 2లో

# తెలంగాణ క్యాబినెట్ విస్తరణ..
# నూతన మంత్రుల ప్రమాణస్వీకారం

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణం
- మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన మంత్రులను ఎంపిక
- గడ్డం వెంకటస్వామి వారసుడిగా..
- ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి
- వాకిటి శ్రీహరి రాజకీయ నేపథ్యమిది






హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగింది. రాజ్‌భవన్‌లో నూతన మంత్రులుగా జి.వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు పాల్గొన్నారు. మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి మిగతా.. 2లో

## "వేశ్యలు" అంటూ చేసిన
## వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు

- రాజధాని మహిళలపై సాక్షి టీవీలో జర్నలిస్ట్ కృష్ణంరాజు వివాదాస్పద వ్యాఖ్యలు
- జర్నలిస్ట్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, ఖండన
- స్త్రీ జాతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసిన సీఎం
- మాజీ సీఎం జగన్ తీరుపై చంద్రబాబు అసంతృప్తి, విచారం
- మహిళల మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



అమరావతి: రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ మిగతా.. 2లో




## ఇదిగో ఇందుకే మేం దాడులు చేస్తున్నాం.. ఇజ్రాయెల్ సైన్యం

- గాజా ఆసుపత్రి కింద హమాస్ సొరంగం వీడియో షేర్ చేసిన ఐడీఎఫ్
- హమాస్ ఉగ్రవాదులు సామాన్యులను రక్షణ కవచంగా వాడుకుంటున్నారని ఆరోపణ
- ప్రజలను అడ్డుపెట్టుకుని ఇజ్రాయెల్ పై దాడులకు పాల్పడుతోందని ఫైర్

## వక్ఫ్ (సవరణ) చట్టం 2025కు
# రాష్ట్రపతి ఆమోదం

చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభ, రాజ్యసభల్లో హృదయపూర్వక చర్చలు

అధిక సంఖ్యలో సభ్యులు బిల్లుకు మద్దతు

లోక్‌సభలో ఈ బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు



ఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వక్ఫ్ (సవరణ) చట్టం 2025 కు ఏప్రిల్ 5న అధికారికంగా ఆమోదం తెలిపారు. ఈ చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభ, రాజ్యసభల్లో హృదయపూర్వక చర్చలు జరుగగా, అధిక సంఖ్యలో సభ్యులు బిల్లుకు మద్దతు ప్రకటించారు. లోక్‌సభలో మిగతా.. 2లో

## ఇదిగో ఇందుకే మేం దాడులు చేస్తున్నాం.. ఇజ్రాయెల్ సైన్యం

ఇజ్రాయెల: గాజాలో హమాస్ ను తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్%-%ఐడీఎఫ్) దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆసుపత్రులపైనా ఐడీఎఫ్ దాడులు చేస్తోందని, అమాయక ప్రజలను చంపేస్తోందంటూ ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ దేశాధినేతలు ఇప్పటికే ఇజ్రాయెల్ తీరును తప్పుబడుతున్నారు. ప్రధాని నెతన్యాహు ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, తాజాగా గాజాపై దాడులను సమర్థించుకుంటూ ఐడీఎఫ్ తాజాగా ఓ వీడియో బయటపెట్టింది. ఖాన్ యూనిస్‌లోని ఒక కీలకమైన ఆస్పత్రి కింద హమాస్ సొరంగం కనుగొన్నామంటూ ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. వీడియోలోని దృశ్యాలను గమనిస్తే.. యూరోపియన్ హాస్పిటల్ కాంపౌండ్‌లో ఓ సొరంగం కనిపిస్తోంది. దీనిని హమాస్ కమాండ్-అండ్-కంట్రోల్ సెంటర్‌గా ఉపయోగిస్తోందని, ఇక్కడి నుంచే ఇజ్రాయెల్ పై దాడులకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఐడీఎఫ్ ఆరోపించింది. సొరంగంలో ఆయుధాలు, నిఘా సామగ్రి ఇతర పరికరాలు ఉంచిన కంట్రోల్ రూములు కూడా కనిపిస్తున్నాయి. హమాస్ తన ప్రయోజనాల కోసం గాజాలోని ఆసుపత్రులను స్థావరాలుగా వాడుకుంటూ పౌరుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోందని ఐడీఎఫ్ ఆరోపించింది. 2023లోనూ ఇదే విధంగా గాజాలోని అతిపెద్ద ఆస్పత్రి అల్ షిఫా కింద సొరంగాన్ని కనుగొన్నట్లు ఐడీఎఫ్ పేర్కొంది. వాటిని ధ్వంసం చేయడానికి తాము దాడులు చేసినప్పుడు అక్కడ ఉన్న అమాయకులు సైతం ప్రాణాలు కోల్పోతున్నారని వివరించింది.

## అదానీ వార్షిక వేతనం రూ.10.41 కోట్లు..

### సొంత ఎగ్జిక్యూటివ్‌ల కంటే తక్కువ!

ఇంటర్నెట్‌డెస్క్: దేశంలోని అత్యంత సంపన్నుల్లో రెండో స్థానంలో ఉన్న అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.10.41 కోట్ల వేతనం అందుకున్నారు. అయితే, దేశంలోని తోటి పారిశ్రామికవేత్తలు, తన గ్రూప్ కంపెనీల్లో పని చేస్తున్న కొంత మంది ఎగ్జిక్యూటివ్‌ల కంటే తక్కువ కావడం గమనార్హం. ఓడరేవులు, ఇంధన రంగాల్లో విస్తరించిన తొమ్మిది లిస్టెడ్ కంపెనీల్లో కేవలం రెండింటి నుంచి మాత్రమే ఆయన వేతనం తీసుకున్నారు. 2023-24లో రూ.9.26 కోట్లుగా ఉన్న ఈ మొత్తం 2024-25లో 12 శాతం పెరిగింది. గ్రూప్‌లో ప్రధాన సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2.26 కోట్లు అందుకున్నారు. ఇతర అలవెన్సులు, ప్రయోజనాల రూపంలో మరో రూ.28 లక్షలు ఆయనకు లభించాయి. దీంతో ఆయన మొత్తం రూ.2.54 కోట్లు తీసుకున్నాయి. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రూ.2.46 కోట్ల కంటే కొంచెం ఎక్కువ. మరో కంపెనీ అదానీ పోర్ట్స్ అండ్ స్పెషనల్ ఎకనమిక్ జోన్ నుంచి రూ.1.8 కోట్ల వేతనం, రూ.6.07 కోట్ల కమిషన్ (లాభాల్లో వాటా) తో కలిపి రూ.7.87 కోట్లు అందుకున్నారు. అంతకు ముందు ఏడాది ఈ మొత్తం రూ.6.8 కోట్లుగా ఉంది. దేశంలోనే అత్యంత సంపన్నుడైన ముకేశ్ అంబానీ వార్షిక వేతనం రూ.15కోట్లుగా ఉండేది. అయితే, కొవిడ్ తర్వాత ఆయన వేతనాన్ని తీసుకోవడం లేదు. ఇక భారతీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత సునీత్ మిత్తల్ (2023-24లో రూ.32.27 కోట్లు), రాజీవ్ బజాజ్ (రూ.53.75 కోట్లు), పవన్ ముంజాల్ (రూ.109 కోట్లు), ఎల్అండ్‌టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రమణ్యం (76.25 కోట్లు), ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ (రూ.80.62కోట్లు) వేతనాలు అదానీ కంటే అధికంగా ఉన్నాయి. అదానీ గ్రూప్‌లోని కొందరు ఎగ్జిక్యూటివ్‌ల జీతాలు కూడా గౌతమ్ కంటే ఎక్కువ. ఏఈఎల్ సీఈఓ వినయ్ ప్రకాశ్ రూ.69.34 కోట్లు, అదానీ గ్రీన్ ఎనర్జీ సీఈఓ వినీత్ ఎస్.జైన్ రూ. 11.23 కోట్లు అందుకున్నారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం.. అదానీ సంపద విలువ 82.5 బిలియన్ డాలర్లు. హిండెన్‌బర్గ్ నివేదిక వల్ల ఆయన ఆస్తుల విలువ సుమారు 150 బిలియన్ డాలర్ల మేరకు తగ్గింది. అయినప్పటికీ గతేడాదిలో రెండు సార్లు ఆసియా అత్యంత ధనవంతుడిగా నిలిచారు. ఇక.. ప్రపంచంలోని సంపన్నుల జాబితాలో ముకేశ్ అంబానీ 104 బిలియన్ డాలర్ల సంపదతో 17వ స్థానంలో, అదానీ 20వ స్థానంలో ఉన్నారు.

## మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం: ప్రధాని మోదీ

దిల్లీ: మహిళల అభివృద్ధి కోసం ఎన్డీఏ సర్కార్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి గుర్తు చేశారు. మహిళల నేతృత్వంలో సాధించిన విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలోనే 11 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "విద్యా, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. స్వచ్ఛ భారత్ ద్వారా వారి గౌరవాన్ని కాపాడడం నుంచి జన్‌ధన్ ఖాతాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసేంత వరకు ఎన్నో పథకాలు అమలు చేశాం. పేద మహిళల ఆరోగ్యం దృష్ట్యా 'ఉజ్వల్ యోజన' పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించాం. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన'తో పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇచ్చాం. ప్రతి ఆడబిడ్డను రక్షించేందుకు, వారు ఉన్నతంగా ఎదిగేందుకు 'బేటీ బచావో, బేటీ పడావో'ను అమలు చేశాం. పేదలు, రైతులు, యువత కోసం ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మీరంతా చూశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా 11 ఏళ్లుగా కృషి చేస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని... రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: హైదరాబాదులో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓ ఆసక్తికర అంశాన్ని అందరితో పంచుకున్నారు. ఇటీవల తాను ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యానని, ఈ సందర్భంగా ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేశానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మోదీ... చంద్రబాబు గారిని చూపించి మీ సన్నిహితుడు కూడా ఇక్కడే ఉన్నారు అని చెప్పారు. అప్పుడు నేను... స్కూల్ మీ (బీజేపీ) వద్ద చదువుకున్నాను... కాలేజి ఆయన (చంద్రబాబు) వద్ద చదువుకున్నాను... ఇప్పుడు రాహుల్ గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నాను అని చెప్పాను. దాంతో అందరూ నవ్వేశారు" అని రేవంత్ రెడ్డి వివరించారు.

## మస్క్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన ట్రంప్

అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన వివాదాస్పద వ్యయ బిల్లుకు అనుకూలంగా ఓటు వేసే రిపబ్లికన్లను శిక్షించేందుకు మస్క్ ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ ప్రతిపాదించిన "బిగ్ బ్యూటిఫుల్ బిల్"ను మస్క్ తీవ్రంగా విమర్శించడంతో ఈ వివాదం మొదలైంది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉన్న కొందరు చట్టసభ సభ్యులు, బిల్లుకు మద్దతిచ్చే రిపబ్లికన్లపై ప్రైమరీ ఎన్నికల్లో పోటీకి నిధులు సమకూర్చాలని గత ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి మద్దతు ఇచ్చిన మస్క్‌ను కోరారు. దీనిపై స్పందించిన ట్రంప్.. "అతను (మస్క్) అలా చేస్తే చాలా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది" అని ఎన్బీసీ న్యూస్‌తో అన్నారు. మస్క్ "అగౌరవంగా" ప్రవర్తించారని కూడా ట్రంప్ ఆరోపించారు. మస్క్‌తో సంబంధాన్ని చక్కదిద్దుకోవాలనే కోరిక తనకు లేదని, అతనితో మాట్లాడే ఉద్దేశం కూడా లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

## దేశంలో కోవిడ్ కలకలం.. ఆరు వేలు దాటిన యాక్టివ్ కేసులు

ఢిల్లీ: భారత్‌లో రోజురోజుకూ కోవిడ్-19 యాక్టివ్ కేసులు పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. దేశంలో కొత్తగా 1,131 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కేసుల సంఖ్య ఆరు వేలు దాటింది. దేశంలో ఆదివారం ఉదయం 8 గంటల నాటికి కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 6,133కి చేరుకుందని ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కోవిడ్‌తో దక్షిణాది రాష్ట్రాల్లో ఆరుగురు మృతి చెందారు. కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు మృతి చెందారు. కేరళలో 1950, గుజరాత్‌లో 822, బెంగాల్‌లో 693, మహారాష్ట్రలో 595, కర్ణాటకలో 366, ఏపీలో 86, తెలంగాణలో 10 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కోవిడ్ మృతుల సంఖ్య కూడా పెరగడంతో మరో 'కరోనా వేవ్'ముంచెత్తుతుందా అన్న భయాలు సైతం వివిధ వర్గాల ప్రజల్లో నెలకొన్నాయి. కేరళలో అత్యధిక పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ తర్వాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. కేరళలో శనివారం నాటికి (గత 24 గంటల్లో) 192, గుజరాత్‌లో 107, పశ్చిమబెంగాల్‌లో 58, కర్ణాటకలో 15, ఆంధ్రప్రదేశ్‌లో 12 కొత్త యాక్టివ్ కేసులు వెలుగు చూశాయి. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లోనూ యాక్టివ్ కేసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం కేసుల వ్యాప్తికి కారణమైన ఒమిక్రాన్ సబ్‌వేరియెంట్లు, లీనియేజ్‌లు ఎగువ శ్వాసకోశ వ్యవస్థ (అప్పర్ రెస్పిరేటరీ) పైనే ప్రభావం చూపుతున్నందున పెద్దగా భయపడాల్సిన పనిలేదని వైద్య నిపుణులు అంటున్నారు.

## కొత్త మంత్రులకు శుభాభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి...

### ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే!

### తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ

### నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ నియామకం

హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, నూతన మంత్రులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషెస్ తెలియజేశారు. నూతన మంత్రులుగా వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి అవకాశం దక్కించుకున్న సంగతి తెలిసిందే. అదేవిధంగా, శాసనసభ ఉపసభాపతి (డిప్యూటీ స్పీకర్)గా రామచంద్రు నాయక్ నియమితులయ్యారు. దీనిపై రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. "నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించబోతున్న వివేక్ వెంకట స్వామి గారు, అడ్లూరి లక్ష్మణ్ గారు, వాకిటి శ్రీహరి గారికి నా అభినందనలు. శాసనసభలో ఉప సభాపతి బాధ్యతలు స్వీకరించబోతున్న రామచంద్రు నాయక్ గారికి నా అభినందనలు..." అని పేర్కొన్నారు. కాగా, మంత్రివర్గంలో చాన్స్ దక్కించుకున్న ఈ ముగ్గురు కూడా తొలిసారి ఎమ్మెల్యేలు కావడం విశేషం. వివేక్ వెంకటస్వామి గతంలో ఎంపీగా పనిచేసిన సంగతి తెలిసిందే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక వాకిటి శ్రీహరి మక్తల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందగా, అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి సెగ్మెంట్లో విజేతగా నిలిచారు.

# తెలంగాణ క్యాబినెట్ విస్తరణ.. నూతన మంత్రుల ప్రమాణస్వీకారం

మొదటి పేజి తరువాయి



కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన మంత్రులను ఎంపిక చేసింది. దీనిలో భాగంగానే ఎస్సీల నుంచి వివేక్ (మాల), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (మాదిగ), బీసీల నుంచి వి.శ్రీహరి ముదిరాజ్‌కు అవకాశం కల్పించారు.

### గడ్డం వెంకటస్వామి వారసుడిగా..

గడ్డం వివేక్ చెన్నూరు నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ప్రముఖ కాంగ్రెస్ నేత జి.వెంకటస్వామి వారసుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2009లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎంపీగా గెలిచారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2013లో తెరాస(ప్రస్తుతం భారాస)లో చేరారు. 2014 ఎన్నికల సమయంలో తెరాస నుంచి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. పెద్దపల్లి స్థానంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2016లో మళ్లీ వివేక్ తెరాసలో చేరారు. ఎంపీ టికెట్ దక్కకపోవడంతో 2019లో ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల తర్వాత భాజపాలో చేరారు. 2023లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరిన వివేక్.. చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 2024లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎంపీగా వివేక్ కుమారుడు వంశీ గెలిచారు.

### ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి

అడ్లూరి లక్ష్మణ్‌ను ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి వరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ధర్మపురి నియోజకవర్గం నుంచి గెలిచారు. భారాస అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 2,229 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1968లో ఆయన కరీంనగర్ జిల్లాలో జన్మించారు. పెద్దపల్లి కళాశాలలో ఐటీఐ పూర్తి చేశారు. 1986-1994 మధ్య కరీంనగర్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1996-2001 మధ్య ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2006లో ధర్మారం జడ్పీటీసీగా పోటీ చేసి గెలిచారు. 2009లో ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2010-2012 మధ్య కరీంనగర్ జడ్పీ ఛైర్మన్‌గా పనిచేశారు. 2009లో అసెంబ్లీ ఎన్నికలు, 2010 ఉపఎన్నికలో ఓడారు. 2013-14 మధ్య ఏపీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2018 నుంచి జగిత్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు.

### వాకిటి శ్రీహరి రాజకీయ నేపథ్యమిది

ఎమ్మెల్యే అయిన తొలిసారే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కింది. ఆయన 1972లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. భారాస అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,522 ఓట్ల తేడాతో గెలిచారు. 2014-2018 మధ్య మక్తల్ జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2001-2006 మధ్య మక్తల్ సర్పంచిగా ఉన్నారు. నారాయణపేట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శిగా పని చేశారు.




## దత్తాత్రేయది పేరుకు హిందుత్వం మతం భారతీయం

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ,జెంటిల్‌మెన్‌కు ప్రతిరూపం దత్తాత్రేయ అని అన్నారు. దత్తాత్రేయను దత్తన్న అని అభిమానంగా పిలుచుకుంటారన్నారు. సాధారణ కార్యకర్త నుంచి జాతీయ నేతగా ఎదిగారని కొనియాడారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, సంఘర్షణలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. "దత్తాత్రేయ కోరుకుంది జనహితం.. ఆయనది లౌకిక వాదం. ఆయన పాటించేది మత సామరస్యం. 'అలయ్ బలయ్' పేరుతో అన్ని వర్గాలను ఏకతాటిపైకి తెచ్చారు. అందరినీ కలిపేందుకు వేదిక రూపొందించారు. ఆయనకు విరోధులు ఎవరూ ఉండరు. ఆయనకు ఏ రాజకీయ పార్టీ అనే వ్యత్యాసం ఉండదు. దత్తాత్రేయది ఆదర్శ రాజకీయ జీవితం. ప్రజాసమస్యలపై ప్రభుత్వాలు, సీఎంలకు లేఖలు రాశారు. లేఖలు రాయడంలో అంబాసిడర్‌గా నిలిచారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం అనునిత్యం పనిచేశారు. ఉత్తర, దక్షిణ భారత్ ప్రజలతో ఆయన మమేకమయ్యారు" అని చంద్రబాబు తెలిపారు

### రాజకీయాల్లో నీతి, నిజాయితీ సిద్ధాంతాలు ముఖ్యం: వెంకయ్య

బండారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ పుస్తకావిష్కరణలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొని మాట్లాడారు. 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో బండారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ రచించారని తెలిపారు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ సిద్ధాంతాలు ముఖ్యమని ఉద్ఘాటించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు. రాజకీయ విమర్శలు సంస్కారవంతంగా ఉండాలని చెప్పారు. అసభ్యంగా మాట్లాడే వారికి ఎన్నికల్లో సరైన జవాబివ్వాలని వెంకయ్యనాయుడు తెలిపారు.

ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. మనోహర్ షిండే వల్లే తాను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. "ఆర్ఎస్సెస్ నా ప్రాణం, నా ఆత్మ, నా సర్వం. వి రామారావు నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చి నడిపించారు. ఇంద్రాసేనారెడ్డి కూడా నా వెన్నంటే ఉన్నారు. రాజకీయాలు వృత్తి, వ్యాపారం కోసం కాదు.. సమాజం కోసం. సమాజం కోసం పనిచేయాలి. పేదల వృద్ధికి కృషి చేయాలి"అని అన్నారు.

తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ.. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇది కేవలం వ్యక్తిగత ప్రయాణం కాదని, గత 60 ఏళ్లలో భారత రాజకీయ, సామాజిక మార్పులకు ప్రతీక అని అన్నారు. ఇలాంటి వ్యక్తిని అందించినందుకు దత్రాత్రేయ తల్లిదండ్రులకు దేశం కృతజ్ఞతలు చెబుతోందన్నారు. "దత్తాత్రేయ.. వాజ్‌పేయీ, అద్వానీ వంటి ప్రముఖులతో కలిసి పనిచేశారు. పని చేసిన ప్రతి హోదాలో పేదలకు మేలు చేసేందుకు విశేషంగా కృషి చేశారు. అలయ్ బలయ్ ద్వారా అందరినీ ఒక తాటిపైకి తీసుకొస్తున్నారు. అధికారం కేవలం పరపతి, పేరు కోసం కాదు.. సేవ చేసేందుకు అనేందుకు ఆయన జీవితం ఒక నిదర్శనం"అని అన్నారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ, ఏపీ, ఒడిశా, త్రిపుర గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, జస్టిస్ అబ్దుల్ నజీర్, కంభంపాటి హరిబాబు, ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భాజపా ఎంపీ లక్ష్మణ్, కాంగ్రెస్ నేతలు కె.కేశవరావు, వి.హనుమంతరావు తదితరులు హాజరయ్యారు.

## ఏపీ రాష్ట్ర చరిత్రలోనే భారీగా ప్రమోషన్లు..

అమరావతి: ఏపీ రాష్ట్ర చరిత్రలోనే వేల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు లభించాయి. వీరిలో వైకాపా సానుభూతి ఉద్యోగులు కూడా ఉన్నారు. అయితే, ఈ ప్రమోషన్లలో ఎలాంటి తారతమ్యాలు కల్పించ లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం కొందరికి అన్యాయం జరిగిందంటూ ఆరోపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి, పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా, కేవలం సర్వీసునే ప్రామాణికంగా తీసుకుంటున్న ఈ ఆన్‌లైన్ విధానంపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు స్పష్టంచేసింది. పైరవీలకు, రాజకీయ జోక్యానికి ఆస్కారం లేదని భరోసా ఇచ్చింది. ఈ యేడాది రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా, ఎటువంటి రాజకీయ ప్రమేయానికి తావులేకుండా ఆన్‌లైన్ ద్వారా 4,853 పదోన్నతులు, 35,235 బదిలీలు విజయవంతంగా పూర్తి చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాలతో పలు దఫాలుగా చర్చించి, వారి సూచనలు పరిగణనలోకి తీసుకుని, ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం "టీచర్ ట్రాన్స్‌ఫర్స్ యాక్ట్"ను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం అన్ని బదిలీలను కేవలం ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తున్నారు. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఆన్‌లైన్ బదిలీల్లో ఉపాధ్యాయుల సౌలభ్యం కోసం పలు నూతన సాంకేతిక సౌకర్యాలు ప్రవేశపెట్టారు. మండల కేంద్రం నుంచి పాఠశాల దూరం, క్లస్టర్లలో ఖాళీల వివరాలు స్పష్టంగా చూపుతున్నారు. ఆప్షన్లను పలుమార్లు మార్చుకునే వీలు, అవగాహన వీడియోలు, సాంకేతిక సందేహాల నివృత్తికి సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. తప్పనిసరి బదిలీ అయ్యేవారు తమ ఆప్షన్లను ఖచ్చితంగా ఖరారు చేయాల్సి ఉంటుంది. గతంలోని మాన్యువల్ కౌన్సెలింగులో ఖాళీల వివరాలు వెంటనే తెలియక సీనియర్లు నష్టపోవడం, రోజుకు కొద్దిమందికే కౌన్సెలింగ్ సాధ్యమవడం, సుదూర ప్రాంతాల నుంచి వచ్చి గంటల తరబడి వేచి చూడాల్సిన ఇబ్బందులు వంటి సమస్యలుండేవని విద్యాశాఖ గుర్తుచేసింది. ఆన్‌లైన్ విధానం వీటికి తెరదించి, సమయం, శ్రమ ఆదా చేయడంతో పాటు, పైరవీలకు పూర్తి అడ్డుకట్ట వేసిందని అధికారులు స్పష్టం చేశారు. సీనియారిటీకి న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1998లో బదిలీల కోసం కౌన్సెలింగ్ విధానం ప్రారంభం కాగా, మాన్యువల్ పద్ధతిలోని లోపాలను అధిగమించేందుకు 2015లో తొలిసారిగా వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ విధానం ఉపాధ్యాయులలో నమ్మకాన్ని పెంపొందించింది. గత ప్రభుత్వం కూడా ఇదే ఆన్‌లైన్ విధానాన్ని కొనసాగించగా, ప్రస్తుత ప్రభుత్వం దానిని మరింత మెరుగుపరిచి, సాంకేతికత సాయంతో ఎలాంటి అపోహలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు విద్యాశాఖ వెల్లడించింది.

## వక్ఫ్ (సవరణ) చట్టం 2025కు రాష్ట్రపతి మోదం

మొదటి పేజి తరువాయి



హృదయపూర్వక చర్చలు జరుగగా, అధిక సంఖ్యలో సభ్యులు బిల్లుకు మద్దతు ప్రకటించారు. లోక్‌సభలో ఈ బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. రాజ్యసభలో అనుకూల ఓట్లు 128, వ్యతిరేక ఓట్లు 95. ఈ బిల్లుపై విపక్షాల నుండి తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం దృఢంగా తన వైఖరిని కొనసాగించింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్, ఈ చట్టం ముస్లింలకు వ్యతిరేకం కాదు అని, ఏ మత విశ్వాసాలనైనా దెబ్బతీయాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఈ సవరణ ద్వారా వక్ఫ్ ప్రాపర్టీల నిర్వహణ, పర్యవేక్షణ, పారదర్శకతకు సంబంధించి కొన్ని కీలక మార్పులు చేయబడ్డాయి. వక్ఫ్ బోర్డుల పని విధానంలో సమీక్ష, ఆస్తుల లెక్కల నిర్వహణ, ప్రజల న్యాయబద్ధమైన వినియోగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. సారాంశంగా, వక్ఫ్ (సవరణ) చట్టం 2025 ముస్లిం మైనారిటీల ఆస్తుల పరిరక్షణను సమర్థవంతంగా చేస్తుందని కేంద్రం పేర్కొంది. అయితే ఈ చట్టంపై సవాళ్లు, చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

## "వేశ్యలు" అంటూ చేసిన వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు

మొదటి పేజి తరువాయి

అమరావతి: రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజధాని గురించి, అక్కడి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా 'వేశ్యలు' అంటూ చేసిన దారుణమైన వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ, మీడియా ముసుగులో సాగుతున్న ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. "తన సొంత మీడియా చానల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనది. ఇది మన సంప్రదాయం. మన భారతీయ జీవన విధానం. ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తాం. అలాంటి మన రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. వాళ్లు ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదనేది సుస్పష్టం.రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. గత విధ్వంస ప్రభుత్వం పై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత మహిళలపై ఉద్దేశ్యపూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించడం. మహిళలను గౌరవించే, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం ఏంటీ

మొదటి పేజి తరువాయి

మాజీ మంత్రి స్పందించారు. ఆదివారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినపుడు ఆర్థిక మంత్రిగా ఉన్నానని, ఆ సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటిలో తన పాత్రను కమిషన్ ముందు వెల్లడించినట్లు చెప్పారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ నేతలు ఇలాంటి కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ ఉప సంఘం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టే లేదని తెలిపారు. కాళేశ్వరంలోని అనేక ప్రాజెక్టుల రీడిజైనింగ్ను కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. త్వరలోనే అన్ని జీవోలు, సబ్ కమిటీ నిర్ణయాలు, సూచనలు బయటపెడతా అని చెప్పారు.

### మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై..

కాళేశ్వరం ప్రాజెక్టు అంశం అసలు కేబినెట్ ముందుకే రాలేదంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కేబినెట్లో చర్చించకుండా ప్రభుత్వంలో ఏదీ జరగదని గుర్తుచేశారు. అలాంటిది కాళేశ్వరం ప్రాజెక్టుపై కేబినెట్ చర్చించలేదనడం సరికాదని అన్నారు. ప్రాజెక్టు విషయంలో తీసుకున్న ప్రతీ నిర్ణయంపై కేసీఆర్ అందరితో సంతకాలు తీసుకున్నారని చెప్పారు. ఈ విషయం అప్పటి మంత్రులు తుమ్మల, జూపల్లి, కడియం శ్రీహరిలకు కూడా తెలుసని అన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

## విజయవాడలో 'సెలూన్ కొనికి' ప్రారంభోత్సవం...

మొదటి పేజి తరువాయి



ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, యార్లగడ్డ వెంకట్రావు ఇరువురూ సెలూన్ నిర్వాహకులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపారం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పవన్ కల్యాణ్ లేత నీలం రంగు రౌండ్ నెక్ టీషర్ట్, నలుపు రంగు షార్ట్స్ ధరించి వచ్చారు. ఆయన క్యాజువల్ లుక్ అందరినీ ఆకట్టుకుంది, ట్రెండీగా కనిపించిందని పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

# విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు

- ఎమ్మెల్యే మనుషలమంటూ స్థానిక నాయకుల అక్రమ నిర్మాణాలు ?
- అనుమంతులు లేకుండానే భారీ షెడ్డులు, వ్యాపార సముదాయాలు
- అనుమతులున్నా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- తీసుకునేది ఇంటి నిర్మాణ అనుమతులు..నిర్మించేది భారీ షెడ్లు
- టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం.. చేతివాటం ప్రదర్శిస్తున్న క్రింది స్థాయి సిబ్బంది



5వ వార్డు విజయవాడ జాతీయ రహదారిలో అనుమతుల పేరిట అక్రమంగా నిర్మించిన పిస్తా హౌజ్ భవనం (ఫైల్ ఫోటో )

రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు: నగర శివారు పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఏకంగా ఎమ్మెల్యే మనుషులంమటూ..స్థానిక ఎమ్మెల్యే పేరు బద్నాం చేస్తూ.. కొందరు స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు అక్రమ నిర్మాణాల జోరు కొనసాగిస్తున్నారు. కౌన్సిల్ పదవీ కాలం ముగియడం, అధికారుల పర్యవేక్షణ లోపం, పూర్తి స్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడం కారణంగా మున్సిపాలిటీ పరిధిలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇదే అదనుగా మున్సిపాలిటీలోని కొందరు క్రింది స్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సమాచారాన్ని అధికారుల వరుకు రాకుండా గోప్యత ప్రదర్శిస్తూ..అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారు. దీంతో పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అంతే లేకుండా పోయింది. ఫలితంగా మున్సిపాలిటీ ఆదాయాకి భారీ గండి పడుతుంది.

తాజా మాజీలు దొరికినకాడికి దోచుకొని రాజకీయ పలుకుబడితో అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు నోటీసులిస్తే..వెంటనే రంగంలోకి దిగుతారు. అవన్నీ తమకు చెందినవారివని, తాము ఎమ్మెల్యే అనుచరులంటూ అధికారులను బెంబేలేత్తిస్తున్నారు. చేసేదేమిలేక అధికారులు నోటీసులతోనే సరిపెడుతున్నారు. ఎవరైనా పిర్యాదుచేస్తే ఇవే విషయాలను స్వయంగా అధికారులే వివరించడంతో పిర్యాదుదారులు ముక్కున వేలేసుకోవాల్సి వస్తుంది. తప్పని పరిస్థితుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు. ఇవన్నీ కండ్లముందే జరుగుతున్నా రాజకీయ ఒత్తిల్లకు తలొగ్గి అధికారులు అటువైపు కన్నెత్తి చూడరు. పిర్యాదులొస్తే అనుమతులున్నాయని దాటవేస్తారు. నిర్మాణాలు ఎవైతేనేం..ప్రభుత్వాని డబ్బులు వస్తున్నాయిగా అంటూ అధికారులే గర్వంగా చెప్తుండడం విస్మయానికి గురుచేస్తున్న అంశం.

మచ్చుకు ఒకటి, రెండు పరిశీలిస్తే.. పెద్ద అంబర్ పేట్ కేంద్రంలోని 5వ వార్డు విజయవాడ జాతీయ రహదారిపై గత కొంత కాలం క్రితం భారీ షెడ్ నిర్మాణాన్ని ( ప్రస్తుతం పిస్తా హౌజ్ రెస్టారెంట్ ) చేపట్టడంతో.. అధికారులకు పిర్యాదులు వచ్చాయి. అనుమతులు ఉన్నాయంటూ దాటవేశారు అధికారులు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే..ఆ భారీ షెడ్డుకు ఇంటి నిర్మాణ అనుమతులు ఉన్నట్లు తేలింది. అయితే, ఇంటి నిర్మాణ అనుమతులతో భారీ షెడ్ నిర్మాణం ఏంమిటని ప్రశ్నిస్తే..ఏ అనుమతులైతేనేం..అనుమతులున్నాయా..లేవా అంటూ ఎదురు ప్రశ్నించారు అదికారులు. అయినా ఆ నిర్మాణం స్థానిక ఎమ్మెల్యే బంధువుదని, ఓ తాజీ మాజీ కౌన్సిలర్ కుటుంబ సభ్యులదని అధికారులే చెప్పడం విడ్డూరంగా ఉందని పిర్యాదుదారుడు ఆశ్చర్యం వ్యక్తం చేసారు.

మరోకటి పరిశీలిస్తే.. తాజాగా 4వ వార్డు బలిజగుడ రోడ్డులో అనుమతులు లేకుండా వ్యాపార సముదాయాలు (మడిగెలు) నిర్మిస్తున్నారు. పిర్యాదు అందిన వెంటనే అధికారులు మొక్కుబడిగా పనులు ఆపడంతో.. స్థానిక మాజీ ప్రజా ప్రతినిధి హుటా హుటిన అధికారులను కలిసినట్లు పక్కా సమాచారం. ఆ మడిగెలు తమవేనని..తాము ఎమ్మెల్యే అనుచరులం అని చెప్పడంతో అధికారులు తొక ముడిచారు. రాజకీయ పలుకుబడితో బాజాప్తుగా అక్రమార్కులు అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధం చేసుకున్నారు. ఇక దానిపై అధికారుల చర్యలు మాత్రం శూన్యంగా మిగిలాయి.

ఈ విధంగా చెప్పుకుంటూ పోతె..పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో గత సంవత్సన్నర కాలంగా అక్రమ నిర్మాణాలకు అడూ..అదుపూ లేకుండా పోతుంది. వీటన్నింటిని అరికట్ట వలసిన అధికారులు కాసులకు, రాజకీయ వత్తిడులకు తలొగ్గి అలసత్వం వహిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తి స్థాయిలో ( అన్ని పని రోజులు విధులకు కేటాయించకం పోవడం ) అధికారులు లేకపోడంతో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాదన. దీన్ని ఆసరాగా చేసుకొని వార్డు ఆఫీసర్లు మరియూ టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరనీయకుండా అన్నీ తామై వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

జాడలేని ప్రత్యేక అధికారి..ప్రతిమ సింగ్

రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల్లో కౌన్సిల్ ( చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ) పదవి కాలం ముగిసి దాదాపు 6 నెలల కాలం పూర్తయ్యింది. వెను వెంటనే




ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారినిగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ ను నియమించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన దాఖలాలు లేవని., కార్యాలయంలో మాత్రం “ ప్రతిమా సింగ్, ప్రత్యేక అధికారి” అని బోర్డు మాత్రం దర్శణం ఇస్తుందని విమర్షలు వినిపిస్తున్నాయి. ఒక జిల్లా స్థాయి అధికారిని మున్సిపాలిటీకి ఎలాగో రాదులే..అనే భావంతో క్రింది స్థాయి అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని, అంతటి స్థాయి అధికారిని మున్సిపాలిటీలో పర్యటిస్తే అక్రమాలకు తావుండదని స్థానికంగా కోరుకుంటున్నారు.

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ అవినీతి అధికారులపై, సిబ్బందిపై వస్తున్న పిర్యాదుల, ఆరోపణల మేరకు.. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కార్యాలయంలోని రెవెన్యూ, సానీటరీ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, అకౌంట్స్ ఇతర విభాగాలు మరియూ అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలన్నింటిని ఆధారాలతో ఒక్కొక్కటిగా త్వరలో బయట పెట్టేందుకు ప్రభాత సూర్యుడు సిద్ధంగా ఉంది.


4వ వార్డు బలిజగుడ రోడ్డులో ఎమ్మెల్యే అనుచరులమని అక్రమంగా నిర్మించిన మడిగెలు


12వ వార్డు అంజనాద్రి నగర్ మెయిన్ రోడ్డులోని డబుల్ బెడ్రూంల ప్రక్కన నిర్మించిన అక్రమ షెటర్లు

1వ వార్డు రాజీవ్ గృహకల్ప శివపార్వతుల బొమ్మ దగ్గర అనుమతుల పేరిట ఒక తాజా మాజీ ప్రతినిధికి చెందిన భారీ షెడ్ నిర్మాణం (ఫైల్)



ఎమ్మెల్యే మనుషలంమంటూ..అక్రమ నిర్మాణాలకు తెర

మున్సిపాలిటీ పరిధిలో కొన్ని వార్డులలో కొందరు స్థానిక తాజా మాజీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రేస్ నాయకులు అక్రమ నిర్మాణలకు తెరతీస్తున్నారు. మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతూ.. అనుమతులు లేకుండానే భారీ షెడ్లు, బహుళ వ్యాపార సముదాయ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్ని చోట్ల ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కొందరు కంటితుడుపు చర్యలు తీసుకుంటున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవడంలేదు మున్సిపల్ అధికారులు.

అనుమతులొకటి..నిర్మాణాలు మరొకటి..!

గృహ నిర్మాణాలను మినహాయిస్తే పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్నవన్నీ దాదాపుగా అక్రమ నిర్మాణాలే. ఇంటి నిర్మాణ అనుమతులు పొంది భారీ షెడ్లను, బహుళ వ్యాపార సముదాయాలను ( మడిగెలు)

**ప్రభాత సూర్యుడు**
**నిజం దాగదు..వార్త ఆగదు**

# మేము రూల్స్ పెడతాం..పాటించం..!

## - నిబంధనలన్నీ..సామాన్యులకే..!






- పోలీసుల పాటించరు.. బడాబాబులకు, రాజకీయనాయకులకు వర్తించవు
- సామాన్యుడు కరెంటు బిల్ కట్టకపోతే కరెంట్ కట్.. బడాబాబుల జోలికి వెళ్లరు
- మంచినీటి బిల్లు కట్టకుంటే నీళ్ళు బంద్..వారి నో ఫరక్
- ఇంటి పన్ను కట్టకుంటే..ఇంటికి తాళం
- సామాన్యుడు ఇళ్ళు కట్టుకుంటే..నో పర్మిషన్ అంటూ వేధింపులు
- పర్మిషన్ ఉన్నా..నిబంధనలకు విరుద్దం అంటూ వేధింపులు
- ఇలా ఎలాంటి రూలైనా పేదోడికే..మధ్యతరగతి సామన్యుడుకే..

ప్రభుత్వాలు ప్రవేశపెట్టే నిబంధనలు సామాన్యులకు, పేదలకేగాని.. ధనికులకు, పారిశ్రామికవేత్తలకు, ముఖ్యంగా రాజకీయ నాయకులకు వర్తించవనేది జగమెరిగిన సత్యం. రాజకీయ నాయకులు, పోలీస్ అధికారులు వాటన్నింటికీ అతీతులే !. అందుకు నిదర్శణం ఈ తాజా చిత్రం. ఈ ఫొటోలో కనిపిస్తున్న ఓ ట్రాఫిక్ పోలీస్ అధికారి. జూన్ 2005, 04వ తేదీ నాడు ఉదయం హైదరాబాద్ లోని బోడుప్పల్ నుండి మాణిక్ చంద్ రోడ్ మార్గంలో వెళ్తున్న సందర్భంలో కనిపించిన దృశ్యం. హెల్మెంట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నపుతున్నాడు ఉండికూడా. హెల్మెంట్ లేకపోతే లేదేమోలే.. మర్చిపోయాడేమో అని అనుకోవచ్చు కానీ, హెల్మెంట్ ఉండి కూడా వాహనానికి తగిలించి నేనే ట్రాఫిక్ పోలీసును, నన్నెవడెంచేస్తాడులే..అన్న రీతిలో నిర్లకంగా వాహనాన్ని నడుపుడున్నాడు. అంతేలే.. ట్రాఫిక్ చాలన్లు వేసేది వారే కదా..! వారికి వేసేది ఎవ్వరులే..!

ఒక సామాన్య వాహనదారుడు హెల్మెంట్ లేకుండా రోడ్ మీద వెళ్తే పట్టుకొని బలవంతంగా బండి తాళాలు లాక్కొని ఫైన్ వేసి ఇబ్బందులకు గురిచేస్తున్న సందర్భాలు కోకొల్లలు అంతేకాదు మరికొందరైతే 50 - 100 రూపాయలకు ఆశపడి డబ్బులు తీసుకొని వదిలేసే అధికారులు కొంతమంది. సామాన్యుడు ఫైన్ కట్టని పరిస్థితిలో బండి లాక్కొని నానా ఇబ్బందులకు గురిచేస్తారు తప్ప వదిలేసే పరిస్థితి చాల తక్కువ. కారు సీటు బెల్ట్ పెట్టకోకపోతే ఫైన్, సిగ్నల్ జంప్ పేరుతే ఫైన్, ఎక్కవ మాట్లాడితే పోలీసు విధులకు ఆటకం అని ఫైన్. ఇవన్నీ సామాన్యులకే. మాకు కాదు. ఉండవు కూడా.

అదే రాజకీయ నాయకులు పోలీస్ అధికారులు నిబంధనలు ఉల్లంఘించినా అడిగే నాథుడు ఉండడు, ఎందుకంటే సామాన్య ప్రజలకు భయమని కాదు సామాన్యుడిలో ఉండే సంస్కారం. అంతేకాదు పారిశ్రామికవేత్తలు కోట్ల రూపాయల పన్ను ఎగ్గొట్టినా ఊరుకుంటారు. కాని సామాన్యుడు కరెంటు బిల్లు సకాలంలో కట్టకపోతే కనెక్షన్ కట్ చేస్తారు. బడా వ్యాపారులకు రాయితీలు ఇస్తారు. సామాన్యులపై పన్నుల భారం మోపుతారు. కాని సామాన్యులు చిన్న నిబంధన ఉల్లంఘించినా నానా రచ్చ చేస్తారు. మన దేశంలో పెద్దలు ఏం చేసినా చెల్లుతుంది. వారు పెట్టుకున్న నిబంధనలు వారే పాటించరు. వారు చేసే చట్టాలు సామాన్యులు అనుసరించడానికి తప్ప వారికి వర్తించవు.

పోలీస్ అధికారి బండి నడపడం తప్పు కాదుకానీ ఆయన హెల్మెంట్ పెట్టకపోవడమే తప్పు. మనం సామాన్యులమైన తప్పును తప్పే అని తీరాల్సిందే. ఇలాంటివారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. ఎందుకంటే రోడ్ల మీద పోయే ప్రతిఒక్కరు తమ రక్షణకొరకు హెల్మెంట్ పెడుతున్నారో లేదో తెలియదు గాని మీ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలనే నిబద్ధతతో హెల్మెంట్ వాడుతున్నారు. కాబట్టి పోలీస్ అధికారులు కూడా నిబద్ధతతో హెల్మెంట్ వాడాలనేది ఒక సామాన్యుడిగా నా ప్రశ్న.

హెల్మెంట్ లేకుండా ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న పోలీసుపై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో..లేక లైట్ తీసుకుంటారో చూద్దాం.

**కోట దామోదర్..**
**కాలమిస్ట్ - ప్రభాత సూర్యుడు**
**(మొబైల్ 9391480475)**

## ఎన్డీఎస్ఏ నివేదిక కాదు.. అది ఎన్డీయే నివేదిక!





**హైదరాబాద్, :** మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఇచ్చిన నివేదికను ఎన్డీయే నివేదిక అనడంలో ఎలాంటి తప్పు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. నాణ్యత లేనిది కాళేశ్వరం, మేడిగడ్డలో కాదని.. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న రాజకీయాల్లోనే అని విమర్శించారు. ఎన్ని కుట్రలు సృష్టించినా.. ఎప్పటికీ వాస్తవమే నిలుస్తుందన్నారు. అశాస్త్రీయ ఆరోపణలను ఎల్ అండ్ టీ ఖండించడం సంతోషమన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ అని, కేసీఆర్ గారు దూరదృష్టి గల నాయకుడు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. 'మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయింది. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీవల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టుకుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం. కేసీఆర్ గారికి పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారు' అని ఎక్స్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. 'ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్-బీజేపీ.. ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్-బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం' అని ఎక్స్‌లో కేటీఆర్ రాసుకొచ్చారు.

## స్వామి ఆశీస్సులతోనే నేను ఈస్థాయిలో ఉన్నా!



**హైదరాబాద్, :** ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలో శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి టెంపుల్ పున:ప్రతిష్ట మహోత్సవం అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భూమి పూజ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ. 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలను కేటాయించారు. పున:ప్రతిష్ట కార్యక్రమం అనంతరం డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఆరాధ్యదైవంగా ఉందన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ప్రచారం ఇక్కడ నుంచే మొదలు పెడతా అని, స్వామి వారి ఆశీస్సులతోనే తాను ఈస్థాయిలో ఉన్నానని చెప్పారు. 'దశాబ్దాలుగా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆరాధ్యదైవంగా ఉంది. ప్రతి ఎన్నికల సమయంలో ప్రచారం ఇక్కడ నుంచే మొదలు పెడతా. రూ. 4 కోట్ల 74 లక్షల రూపాయలు దేవాలయ అభివృద్ధి కి కేటాయించాము. మీరందరూ గెలిపిస్తేనే నేను ఉప ముఖ్యమంత్రిని అయ్యాను. రాష్ట్ర ప్రజలందరూ చల్లగా ఉండాలని ప్రజా ప్రభుత్వం మంచి పాలన అందిస్తుంది. సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ పోతుంది. రాష్ట్రంలో ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణం కింద 20 వేల కోట్ల రూపాయలు ఇస్తుంది. 22 వేల కోట్ల రూపాయలు రెండు లక్షల లోపు రైతులకు రుణమాఫీ చేశాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని వారికి రూ.12 వేలు ఇస్తున్నాం' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. 'ప్రతి ఎన్నికల కార్యక్రమం ఇక్కడి నుంచే మొదలు పెట్టా. శ్రీయోగనంద లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో నేను ఈస్థాలో ఉన్నా. లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలకు ఉండాలి. ప్రజా సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుంది. పేద ప్రజలకు గ్యాస్, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ లాంటి పథకాలు ఈ ప్రభుత్వం అందజేస్తుంది. రైతు భరోసా, రుణమాఫీ, ఆత్మీయ భరోసా పథకాలను ప్రభుత్వం అందజేస్తుంది. పేద ప్రజలకు ఇందిరా గిరి ఆవాస్ యోజన పథకం కూడా ఉంది' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

## తెలంగాణ రైతులకు గుడ్ న్యూస్..
## 4 ఎకరాలు, అంతకంటే ఎక్కువ భూమి ఉన్నవారికి..

**హైదరాబాద్, :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సమర్థవంతంగా అమలు చేస్తూ వస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ తో పాటు తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ.. తదితర అనేక సంక్షేమ పథకాలతో రేవంత్ ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇక తెలంగాణలోని పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేపట్టాలని భావిస్తోంది. ఈ మేరకు కసరత్తులు చేస్తోంది. అయితే తెలంగాణలోని రైతులకు శుభవార్త చెప్పింది రేవంత్ సర్కార్. త్వరలోనే రైతు భరోసా పథకం కింద నగదును అన్నదాతల అకౌంట్లలో వేసేందుకు సమాయత్తం అవుతోంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కీలక ప్రకటన చేశారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని త్వరలో 4 ఎకరాలు లేదా అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకూ కేవలం 3.5 ఎకరాలు భూమి ఉన్న రైతులకే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించారు. అయితే తాజాగా 4 ఎకరాలు లేదా అంతకంటే ఎక్కువ భూమి కలిగిన రైతులకు కూడా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తామని తుమ్మల కీలక ప్రకటన చేశారు. అయితే తొలుత ఎకరాకు రూ.7,500 పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం ఎకరానికి రూ.6,000 చొప్పున అందిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తుమ్మల స్పష్టం చేశారు. మరోవైపు ఇటీవల భారీ వర్షాలతో రాష్ట్రంలోని చాలా చోట్ల ధాన్యం తడిసిపోయింది. అయితే తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా.. పారదర్శకంగా పూర్తి చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగును కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని.. త్వరలోనే రాష్ట్రంలో ఆయిల్ పామ్ మిల్లును ఏర్పాటు చేస్తామని తుమ్మల స్పష్టం చేశారు.

# కరోనా కొత్త వేరియెంట్లు అంత ప్రమాదకరం కాదు

ఆందోళన అక్కర్లేదు

చాలామందిలో లక్షణాలు కూడా కనిపించటంలేదు


అలా అని నిర్లక్ష్యం చేయొద్దు.. జాగ్రత్తలు పాటించాలి

గత లక్షణాలకు అదనంగా ఈసారి డయేరియా, తీవ్ర అలసట

వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి

టీకా బూస్టర్ డోస్ వేసుకోవటం మంచిదే..

సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఉదయ్‌లాల్ సూచన



హైదరాబాద్: దేశంలో కరోనా మళ్లీ విస్తరిస్తోంది. సినిమా భాషలో చెప్పాలంటే.. కోవిడ్‌కు సీక్వెల్ వచ్చింది. కరోనా వైరస్ రీ-రిలీజ్ అయ్యింది. గతంలో ఈ వైరస్ హారర్ సినిమాలా భయపెట్టింది. కానీ, తాజా సీక్వెల్ తీవ్రత మాత్రం కాస్త తక్కువే అంటున్నారు డాక్టర్లు. ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, ఆంధ్ర, తెలంగాణల్లో మరోమారు కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో.. ఈ కొత్త వైరస్ గురించి సీనియర్ కన్సలెంట్ జనరల్ మెడిసిన్ అండ్ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఉదయ్‌లాల్ చెబుతున్న విషయాలివి..

ప్రశ్న: ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న వేరియెంట్ ఏమిటి? దానికి ప్రత్యేకతలు ఏవైనా ఉన్నాయా?

జవాబు: ప్రస్తుతం భారత్‌లో ఎన్.బి.1.8.1, ఎల్.ఎఫ్.07, జె.ఎన్.1 వంటి వేరియెంట్లు ఎక్కు వగా వ్యాప్తిలో ఉన్నాయి. ఎన్.బి.1.8.1, ఎల్.ఎఫ్.7 వేరియంట్లను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్‌ఓ) జాగ్రత్తగా గమనిస్తూ 'వేరియెంట్స్ అండర్ మానిటరింగ్'గా చెబుతోంది. ఈ వేరియంట్లన్నింటిలోనూ జె.ఎన్.1 చురుగ్గా వ్యాప్తి చెందుతోంది. ఇది బి.ఎ.2.86 నుంచి ఆవిర్భవించినట్లు తెలుస్తోంది. చురుగ్గా వ్యాప్తిచెందినా దీని తీవ్రత చాలా తక్కువ కావడంతో రోగులు ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం కూడా చాలా తక్కువే. కొందరిలో ఇది వచ్చినట్టు కూడా తెలిసే అవకాశం లేదు. అంతేకాదు.. ఈ వైరస్‌తో వచ్చే జ్వరం, ఇతర దుష్ప్రభావాలు చాలావరకు వాటంతట అవే తగ్గిపోతున్నాయి.

ప్రశ్న: కరోనా వైరస్ తొలిసారి వచ్చినప్పుడు చాలామంది ప్రాణాలకు ముప్పు తెచ్చింది. ఈసారి కూడా తొలిసారి వస్తున్న వేరియంట్లు చురుగ్గా ఉండి ప్రాణాంతకం కావచ్చా?

జవాబు: అలా ఏమీ లేదు. అప్పట్లో కొత్తగా వచ్చిన డెల్టా వేరియంట్లు బాగా చురుగ్గా ఉండటంతో పాటు తీవ్రత కూడా ఎక్కువగా ఉండి చాలా ప్రాణ హాని కలిగించాయి. ప్రస్తుతం వస్తున్న వేరియంట్లు.. మరీ ముఖ్యంగా జె.ఎన్.1 వంటివి గతంలోని ఒమిక్రాన్ వైరస్ నుంచి మ్యూటేట్ అయినవే. గతంలో ఒమిక్రాన్ వేరియంట్ వచ్చే నాటికే వైరస్ బాగా బలహీన పడింది. కాబట్టి ఇప్పుడు ఇవి ప్రాణహాని గానీ, ఆస్పత్రిలో చేరా ల్సిన పరిస్థితినిగానీ తెచ్చి పెట్టక పోవచ్చు. అయితే, లక్షణాల తీవ్రత ఎక్కు వగా ఉంటే బాధితు లను వీలైనంత త్వరగా హాస్పి టల్‌కు తరలించాల్సిందే. 60 ఏళ్లు పైబడ్డ వృద్ధులు.. క్రానిక్, అన్ కంట్రోల్డ్ బ్రాంకియల్ ఆస్తమా ఉన్నవారు, డయాబెటిస్ వంటివి ఉండి ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారు మినహా మిగతావారికి ఈ వేరియంట్లు ఏమాత్రం ప్రమాదకరం కాదు. అలాగని నిర్లక్ష్యంగా ఉండటం సరికాదు.

ప్రశ్న: ఇప్పుడు కనిపిస్తున్న వేరియెంట్ల లక్షణాలు ఏమిటి?

జవాబు: లక్షణాలన్నీ గతంలో లాగే ఉంటాయి. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ముక్కు కారడం, డయే రియా వంటి లక్షణాలు కనిపిస్తాయి. కాకపోతే ఈసారి లక్ష ణాల్లో కాస్త భిన్నత్వం కనిపిస్తోంది. గతంలో జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ముక్కు కారడం వంటి లక్షణాలు ఎక్కువ. ఇప్పుడూ ఆ లక్ష ణాలు ఉన్నప్పటికీ డయేరియా (నీళ్ల విరేచనాలు), తీవ్రమైన అలసట (సివియర్ ఫెటీగ్), ఆకలి లేకపోవడం వంటి జీర్ణ సంబంధిత లక్షణాలు కనిపిస్తున్నాయి.

ప్రశ్న: నివారణకు ఎలాంటి జాగ్రత్తలు అవసరం?

జవాబు: గతంలో పాటించిన జాగ్రత్తలే ఈసారి కూడా పనికి వస్తాయి. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ తప్పనిసరిగా వేసుకో వాలి. చేతులు తరచుగా సబ్బుతో కడుక్కోవాలి. శానిటైజర్స్ ఉప యోగించాలి. భౌతిక దూరాలు పాటించడం మేలు చేస్తుంది. గర్భ వతులు బహిరంగ ప్రదేశాలు, గుంపుల్లోకి రాకపోవటం మంచిది.

తప్పని పరిస్థితుల్లో రావా ల్సి వస్తే మాస్క్ ధరించాలి. మునపటిలాగే బాధి తులతో పాటు మిగతావారు కూడా అన్ని పోషకా లు అందేలా ఆకుకూరలు, కూరగాయలతో పాటు తినేవారైతే మాంసాహారంతో మంచి పోషకా హారం, తగినంత విశ్రాంతి తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోతే వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుంది.

ప్రశ్న: మునుపటిలాగే అందరూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలా?

జవాబు: అందరూ పరీక్షలు చేయించుకోకపోయినా ఒకవేళ లక్షణాలు కనిపించినవారు మాత్రం వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవడం మంచిది. పరీక్షలో ఒకవేళ వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయితే డాక్టర్‌ను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వారు సూచించిన లక్షణాలను తగ్గించే మందులు తీసుకోవడం అవసరం. దీనివల్ల ప్రమాదకరమైన పరిస్థితిని నివారించవచ్చు.

ప్రశ్న: కొత్త చికిత్సలు ఏమైనా అందుబాటులోకి వచ్చాయా?

జవాబు: ఇది వైరస్‌తో వచ్చే సమస్య కావడం వల్ల దీనికి సాధారణంగా మందులు ఉండవు. కాకపోతే లక్షణాలను బట్టి చికిత్స అందిస్తారు. ఉదాహరణకు జ్వరం, ఒళ్లునొప్పులకు పారాసిటమాల్ ఇవ్వడం వంటివి. ఇది వైరస్‌తో వచ్చే సమస్య కాబట్టి యాంటీబయాటిక్స్ వంటివి వాడకూడదు. గొంతునొప్పి తగ్గడానికి గోరువెచ్చని నీళ్లలో ఉప్పు వేసి పుక్కిలించాలి. చేతులు శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలి. శరీరంలో నీరు / ద్రవాల మోతాదులు తగ్గకుండా (డీ-హైడ్రేషన్‌కు గురికాకుండా) ఉండటం కోసం తగినన్ని నీళ్లు తాగాలి. ద్రవాహారం తీసుకోవాలి. రిస్క్ ఎక్కువ ఉన్నవారు పల్స్ ఆక్సిమీటర్‌తో చెక్ చేసుకుంటూ ఆక్సిజన్ మోతాదులు తగ్గుతున్నట్లు గమనిస్తే బాధితులను వెంటనే హాస్పిటల్‌కు తరలించాలి.

ప్రశ్న: ఈసారి మళ్లీ టీకాలు తీసుకోవాలా?


జవాబు: గతంలో టీకా తీసుకుని బూస్టర్ డోస్ కూడా తీసుకున్న వారిపై తాజా వేరియెంట్లు అంతగా ప్రభావం చూపకపోవచ్చు. అయితే, జాగ్ర త్తగా ఉండటం, వృద్ధులు బూస్టర్ డోస్ తీసుకోవడం మంచిదే. దీనివల్ల హాస్పి టల్‌లో చేర్చాల్సిన పరిస్థితి చాలా వరకు తగ్గుతుంది. ప్రస్తుతం ఎమ్- ఆర్ఎన్ఏ వ్యాక్సిన్ వంటివి బాగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. కానీ, మన దేశంలో అవి లేవు. మనకు మామూలు వ్యాక్సిన్స్ బూస్టర్ డోసులే సరిపో తాయి. సాధారణంగా ఒక మోతాదు టీకా ఆరు నెలలకు పైగానే సమర్థంగా పనిచేస్తుంది. కాకపోతే దాని ప్రభావం క్రమంగా తగ్గు తూ ఉంటుంది కాబట్టి బూస్టర్ తీసుకోవడం మంచిదే.

## సుప్రీంకోర్టు రాష్ట్రపతికి గడువు విధించగలదా.. రాజ్యాంగ నిబంధనలు ఏమి చెబుతున్నాయి

దేశ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల రాష్ట్రపతి, గవర్నర్లకు రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై నిర్ణయం తీసుకో వడానికి నిర్దిష్ట గడువు విధించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, రాజ్యాంగంలో స్పష్టమైన నిబంధనలు లేనప్పుడు కోర్టు ఈ ఆదేశాలు ఎలా జారీ చేసిందని ప్రశ్నించారు. రాష్ట్రపతి వ్యాఖ్యలు ఈ వ్యవహారంలోని రాజ్యాంగపరమైన చిక్కులను మరింతగా వెలుగులోకి తెచ్చాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లు గవర్నర్ ముందుకు వచ్చినప్పుడు, ఆయన దానిని ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు లేదా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపవచ్చు. అయితే, గత కొంతకాలంగా పలు రాష్ట్రాల్లో గవర్నర్లు కొన్ని బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపిన తర్వాత, ఆ బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో గణ నీయమైన జాప్యం చోటు చేసుకుంటోంది. దీనివల్ల సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అభివృద్ధి పనులు నిలిచిపోవడం, కొత్త చట్టాల అమలు ఆలస్యం కావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, పలు రాష్ట్ర ప్రభుత్వాలు తమ శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు రాష్ట్రపతి పరిశీలనకు పంపడం, ఆ బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

### సుప్రీం స్పష్టతతో.. రాష్ట్రాలకు ఊరట!

ఈ వ్యవహారాన్ని పరిశీలించిన సుప్రీంకోర్టు, సంబంధిత రాష్ట్రాల వాదనలను విన్న అనంతరం, ఈ సమస్యపై స్పష్టమైన మార్గదర్శకాన్ని రూపొందించాలని నిర్ణయించింది. ఈ తీర్పులో ప్రధానంగా రాజ్యాంగంలోని రెండు ముఖ్యమైన అధికరణలు చర్చకు వచ్చాయి. మొదటిది ఆర్టికల్ 200, ఇది రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లు విషయంలో గవర్నర్‌కు ఉన్న అధికారాలను వివరిస్తుంది. గవర్నర్ బిల్లును ఆమోదించే అధికారం, తిరస్కరించే అధికారం లేదా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపే అధికారం కలిగి ఉంటారు. రెండవది ఆర్టికల్ 201, ఇది రాష్ట్రపతి పరిశీలన కోసం బిల్లును గవర్నర్ పంపినప్పుడు, రాష్ట్రపతి ఆ బిల్లును ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చునని తెలుపుతుంది. ఈ రెండు అధికరణలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, సుప్రీంకోర్టు తన తీర్పులో గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించింది. అంతే కాకుండా, ఒకవేళ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చోటు చేసుకుంటే, అందుకు తగిన కారణాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కూడా పేర్కొంది. ఈ తీర్పు రాష్ట్ర ప్రభుత్వాలకు కొంత ఊరటనిచ్చింది. పైగా ఇది రాష్ట్ర ప్రభుత్వాల శాసనాధికారాలను పరిరక్షించడంలో సహాయపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ తీర్పు ప్రకారం, రాష్ట్రపతి బిల్లును తప్పనిసరిగా ఆమోదించాలి లేదా తిరస్కరించాలి, లేదా కొన్ని నిర్దిష్ట సవరణలతో తిరిగి పంపాలి. నిర్ణయం తీసుకోవడంలో అనవసరమైన జాప్యం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.



### రాజ్యాంగబద్ధ పదవులను గౌరవించాలి!

అయితే, సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పటి నుండి కొన్ని భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు న్యాయ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు ఈ తీర్పును సమర్థిస్తూ, ఇది రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పరిరక్షిస్తుందని, గవర్నర్, రాష్ట్రపతి కార్యాలయాల అధికారాలను మరింత క్రమబద్ధీకరిస్తుందని వాదిస్తున్నారు. మరోవైపు, మరికొందరు ఈ తీర్పును విమర్శిస్తూ, ఇది రాష్ట్రపతి అధికారాలలో అధికంగా జోక్యం చేసుకుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఉపరాష్ట్రపతి వంటి ఉన్నత స్థాయి వ్యక్తులు కూడా బహిరంగంగానే ఈ తీర్పును విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాల శాసనాధికారాలను పరిరక్షించడం ఎంత ముఖ్యమో, రాష్ట్రపతి, గవర్నర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమని వారు వాదిస్తున్నారు. రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని రాజ్యాంగ పరిధిలో వినియోగించాలని, న్యాయవ్యవస్థ నిష్పాక్షికంగా రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని వారు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా భారత న్యాయవ్యవస్థ పాత్రపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది.

### అత్యున్నత వ్యవస్థ ఇదే!

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.వి. చంద్రచూడ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ, "న్యాయ వ్యవస్థ చట్టాలను పరిరక్షించేది" అని పేర్కొన్నారు. ఇది న్యాయ వ్యవస్థ ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. న్యాయ వ్యవస్థ లేకపోతే, చట్టాలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంది. పౌరుల హక్కులు ఉల్లంఘించబడవచ్చు. న్యాయవ్యవస్థ ఈ సమస్యలను నివారిస్తుంది. అంతేకాకుండా, న్యాయ వ్యవస్థ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని పరిరక్షిస్తుంది. ఒకప్పుడు పార్లమెంటే అత్యున్నతమైనదని వాదించ బడింది, అంటే పార్లమెంటు చేసిన చట్టాలే దేశంలో అత్యున్నతమైనవని కొందరు భావించారు. అయితే, సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో రాజ్యాంగమే అత్యున్నతమైనదని, న్యాయవ్యవస్థ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని స్పష్టం చేసింది. న్యాయ వ్యవస్థ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుతుందని కూడా పేర్కొంది, అంటే రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలను మార్చే చట్టాలను న్యాయ వ్యవస్థ కొట్టివేస్తుంది. ఇది న్యాయ వ్యవస్థ ముఖ్యమైన బాధ్యత.

### రాష్ట్రపతికి గడువు లేదు..

మరోవైపు న్యాయవ్యవస్థ తన పరిధిని దాటి కార్యనిర్వాహక శాఖ అధికారాల్లో జోక్యం చేసుకుంటోందని విమర్శకులు పేర్కొంటున్నారు. రాజ్యాంగం రాష్ట్రపతికి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో బిల్లులను ఆమోదించకుండా నిలిపివేసే అధికారాన్ని ఇస్తుంది. అయితే, ఈ తీర్పు ఆ అధికారాన్ని తగ్గిస్తుందనే వాదనలు ఉన్నాయి. రాష్ట్రపతికి గడువు విధించడం ద్వారా, రాజ్యాంగం ప్రసాదించిన విచక్షణాధికారాన్ని పరిమితం చేస్తుందని కొందరు భావిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో, రాష్ట్రాలు ఆమోదించిన బిల్లులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా ఉండవచ్చు. రాజ్యాంగంలో రాష్ట్రపతికి బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి స్పష్టమైన గడువు లేనందున, కోర్టు ఈ విషయంలో జోక్యం చేసుకోవడం ఎంతవరకు సమంజ సమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### ఈ తీర్పు అమలును బట్టి..

సుప్రీంకోర్టు ఈ మూడు నెలల గడువును ఏ ప్రాతిపదికన నిర్ణయించిందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇది రాష్ట్రాల వాదనలు, పాలనా సౌలభ్యం, లేదా ఇతర న్యాయ సూత్రాల ఆధారంగా తీసుకున్న నిర్ణయమా అనేది తెలియాల్సి ఉంది. రాజ్యాంగంలో అధికారాల విభజన స్పష్టంగా ఉన్నప్పటికీ, కొన్నిసార్లు ఈ పరిధుల మధ్య స్పష్టత లోపిస్తుంది. న్యాయ వ్యవస్థ రాజ్యాంగ పరిరక్షకురాలిగా తన బాధ్యతను నిర్వర్తిస్తున్నప్పటికీ, కార్యనిర్వాహక అధికారాల్లోకి అతిగా జోక్యం చేసుకుంటోందనే విమర్శలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో ఈ అంశంపై మరింత లోతైన చర్చలు జరిగే అవకాశం ఉంది. సుప్రీంకోర్టు తీర్పు అమలు దాని పర్యవసానాలను బట్టి రాజ్యాంగ సవరణ అవసరమా లేదా అనే దానిపై ఒక నిర్ణయా నికి రావచ్చు. అయితే, ప్రస్తుతానికి ఇది న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థ పరిధులపై ఒక ముఖ్యమైన చర్చను లేవనెత్తింది.

## అయకార్ భవన్‌లో 'డయల్'ల్యాబ్ ఏర్పాటుచేసిన సీబీడీటీ

సీజ్ చేసిన పెన్‌డ్రైవ్స్, హార్డ్‌డిస్క్‌ల విశ్లేషణలో కీలకం

ఢిల్లీ, ముంబై తర్వాత హైదరాబాద్‌లోనే ఈ సౌకర్యం


## పన్ను ఎగవేతపై పక్కాగా విశ్లేషణ




హైదరాబాద్: కంపెనీల జమాఖర్చులు, లెక్కలు ఒకప్పుడు పుస్తకాల్లో ఉండేవి. ఆదా యపు పన్ను శాఖ (ఐటీ) అధికారులకు అనుమా నం వస్తే వాటిని స్వాధీనం చేసుకుని సరిచూసే వాళ్లు. ప్రస్తుతం అన్నీ కంప్యూటర్లు, ల్యాప్‌టా ప్‌లు, పెన్‌డ్రైవ్స్, హార్డ్‌డిస్క్‌ల్లోకి మారిపోయా యి. పన్ను ఎగవేత కేసుల దర్యాప్తులో కీలకమైన వీటిని పరిరక్షించడం, విశ్లేషించడానికి డిజిటల్ ల్యాబ్స్ అవసరం. కానీ, కొన్నాళ్ల క్రితం వరకు ఈ ల్యాబ్స్ ఢిల్లీ, ముంబైలో మాత్రమే ఉండేవి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్స్ (సీబీడీటీ) హైదరాబాద్‌లోనూ ఇటీవల డిజిటల్ ఇంటెలిజెన్స్ అండ్ ఎనలటిక్స్ ల్యాబ్ (డీఐఏఎల్)ను ఏర్పాటు చేసింది. బషీర్‌బాగ్‌లోని అయకార్ భవన్‌లో ఇది పని చేస్తోంది. సీబీడీటీ అమలులోకి తెచ్చిన నేషనల్ సైబర్ ఫోరెన్సిక్ పాలసీ-2024 అమలులో భాగంగా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

పన్నుల విశ్లేషణలో కీలకం: కంపెనీలు, వ్యక్తులకు చెందిన ఈ-మెయిల్స్, ఆన్‌లైన్‌లో ఉన్న ఆర్థిక లావా దేవీల రికార్డులు, ఇతర డిజిటల్ కార్యకలాపాలను విశ్లేషించి, దర్యాప్తు చేయడానికి ఈ డయల్ ఉపకరి స్తోంది. ఆదాయపు పన్ను ఎగవేత, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల్ని ఐటీ అధికా రులు దర్యాప్తు చేస్తుంటారు. ఇందులో భాగంగా సంస్థలు, వ్యక్తుల స్థిరచరాస్తులకు సంబంధించిన క్రయ విక్రయాల వివరాలతో పాటు కార్పొరేట్ వ్యవహా రాల మంత్రిత్వ శాఖ, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, జీఎస్టీ, బ్యాంకు ఖాతాలు తదితర లావా దేవీలు, రికార్డులను సేకరించి విశ్లేషించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఆయా వ్యక్తుల సోషల్ మీడియా పోస్టులను కూడా క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ద్వారా విదేశీ పర్యటనలు, భారీ ఖర్చులతో ఆడంబరంగా జరిగిన వివాహాలు, విలాసవంతమైన ఇళ్లు, జీవ శైలిలకు సంబంధించిన వివరాలను సేకరించాల్సి ఉంటుంది. వీటన్నింటినీ బేరీజు వేస్తూ ఆయా వ్యక్తులు, సంస్థలు దాఖలు చేసిన ఐటీ రిటర్న్‌లు, అడ్వాన్స్ ట్యాక్స్ తదితరాలను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేయాలి. డిజిటల్ ఫార్మాట్‌లో ఉండే ఈ రికార్డులను డయల్‌లో పొందుపరిస్తే చాలు.. పక్కా విశ్లేషణలను అధికారులకు అందిస్తుంది. దశలవారీగా విశ్లేషించి నివేదికలు ఇవ్వడంతో పాటు ఆయా డేటాను అత్యంత భద్రంగా దాచే సాంకేతికత డయల్‌లో ఉందని అధికారులు చెప్తు న్నారు. దర్యాప్తు అధికారులు సైతం తమ కంప్యూటర్ల ద్వారానే ఈ డేటా మొత్తాన్ని చూసుకునే అవకాశం ఉంది. దాడుల సమయంలో అధికా రులు స్వాధీనం చేసుకున్న డిజిటల్ డేటాను ఈ ల్యాబ్ భద్రపరుస్తుంది. ఈ డేటాను ట్యాంపర్ చేయడానికి, అనధికారికంగా యాక్సెస్ చేయడా నికి ఆస్కారం ఉండదు. హైదరాబాద్ ల్యాబ్‌కు అనుబంధంగా విజయ వాడ, విశాఖపట్నంలో అక్కడి అవసరాలకు తగ్గట్టు తక్కువ సామర్థ్యంతో ల్యాబ్‌లు ఏర్పాటు చేయడా నికి సీబీడీటీ సన్నాహాలు చేస్తున్నట్లు ఆదాయపు పన్ను శాఖ అధికారులు తెలిపారు.

## యోగాంధ్ర తీర్మానం ప్రవేశ పెట్టిన సీఎం చంద్రబాబు



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు యోగాంధ్ర తీర్మానం ప్రవేశ పెట్టారు. రెండు నిమిషాలు మౌనంగా మెడిటేషన్ చేసి తీర్మానాన్ని బలపరచమని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ యుగంలో ఉన్నాం.. వత్తిడితో ఉన్నాం.. గత ఐదేళ్లలో పార్టీ కార్యకర్తలు ఎంతో ఇబ్బంది పడ్డారు అని తెలిపారు. యోగాను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకుని, సాధన చేయాలి అని సూచించారు. 11వ అంతర్జాతీయ యోగాను ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా పెట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కోరారు.. జూన్ 27వ తేదీన విశాఖపట్నంలో జరిగే యోగా డే చారిత్రక ఘటన.. ప్రతి ఒక్కరూ యోగను తమ జీవితంలో భాగం చేసుకోవాలి అన్నారు. ఇక, వేద కాలం నుంచి యోగా శాస్త్రం ఉంది.. పతంజలి మహర్షి మనకు అద్భుతమైన యోగాను ఇచ్చారు అని సీఎం చంద్రబాబు తెలిపారు. అయితే, సులువైన ఆసనాలతో యోగా ప్రాక్టీస్ చేసి మనం ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవచ్చు అని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. 177 దేశాల్లో యోగాను పాట్టిస్తున్నారు.. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రధాని మోడీ ఆమోదింపజేశారని తెలిపారు. యోగాతో సరికొత్త రికార్డు స్థాపించ బోతున్నాం.. ఇప్పటికే 28 లక్షల మంది రిజిస్టర్ చేయించుకున్నారు.. మాస్టర్ ట్రైనర్లను తయారు చేసాం.. మండల, గ్రామ స్థాయితో పాటు పర్యాటక ప్రదేశాలలో కూడా యోగాపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం అని చంద్రబాబు అన్నారు.ద

## కులం వల్ల ఎవరికి సమాజంలో గుర్తింపు రాలేదు..



**హైదరాబాద్, :** బంజారాహిల్స్ లోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్ లో గురుకులాల విద్యార్థులకు బహుమతులను ప్రధానం కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం అంటే గాలి నుంచి ఉడి పడలేదు అన్నారు. మీ మద్యలో ఉంట .. మీతోనే ఉంటానని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆశీర్వదించారు.. అట్లా అయిన నేను ముఖ్యమంత్రి.. ఇక, మొదటి 25 ఏళ్ల కష్టపడితే.. మరో 75 ఏళ్లు సంతోషంగా ఉండొచ్చు అన్నారు. అట్రాక్షన్ లో పడి లైఫ్ డివిఏట్ కాకండి అని సూచించారు. అలాగే, మీ తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి తేకండి.. నేను చదివింది అంతా ప్రభుత్వ స్కూల్ లోనే.. ప్రైవేట్ స్కూల్ లో ఎక్కువ మంది చదువుతున్నారు.. మనం విశ్లేషణ చేసుకోవాలి.. ఖాసిం మా ఊరు అతను.. ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ అయ్యాడు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, కేసీఆర్ దళితులను అవమానించారు.. కానీ, ఇప్పుడు మా గడ్డం ప్రసాద్ కుమార్ నీ మైక్ అడిగి మాట్లాడేలా చేసింది మేము అని సీఎం రేవంత్ చెప్పారు. అక్కడ తప్పించుకున్నా.. ఇక్కడ తప్పించుకోలేక పోయాడు కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మక కలిగించాలని సూచించారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లో ఉంది.. అందరూ జీవితంలో రాణించేలా చదువుకోండి.. పిలిస్తే పలికేలా నేను ఉంటా.. పని చేస్తా.. యంగ్ ఇండియా నా బ్రాండ్.. నా బ్రాండ్ అంబాసిడర్లు మీరే అని పేర్కొన్నారు. అలాగే, ప్రజా ప్రభుత్వంలో దళిత బిడ్డలకు పట్టంకట్టాం.. కులం వల్ల ఎవరికీ సమాజంలో గుర్తింపు రాలేని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## లోకేష్‌కి కీలక పదవి..! మహానాడులో ప్రతిపాదన




**అమరావతి,:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్‌కి.. ఈ సారి పార్టీలో కీలకమైన బాధ్యతలు అప్పగిస్తారనే చర్చ సాగుతోంది.. ఇక, మహానాడులో ఈ రోజు కీలక పరిణామాలకు అవకాశాలు ఉన్నట్టుగా తెలుస్తోంది.. ఎందుకంటే.. ఈ రోజు టీడీపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక, ప్రమాణస్వీకారం అన్ని జరిగిపోనున్నాయి.. అయితే, మహానాడు వేదికగా మంత్రి నారా లోకేష్ కు కీలక పదవి ఇవ్వాలని ప్రతిపాదించారు సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర.. లోకేష్‌కు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని మినీ మహానాడులో తాము తీర్మానించామని.. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు చెప్పారు ధూళిపాళ్ల నరేంద్ర.. పార్టీ నేతలు, శ్రేణులు, అందరూ కోరుకుంటున్న విధంగా లోకేష్ కు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరారు నరేంద్ర.. కాగా, ఇప్పటికే వరకు టీడీపీలో జాతీయ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో, ఏపీ, తెలంగాణకు పార్టీ అధ్యక్షులు ఇలా కీలక పదవులు ఉన్నాయి.. అయితే, నారా లోకేష్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌ను చేయాలన్న డిమాండ్ ఉండడం.. ప్రతిపాదనలు కూడా చేయడంతో.. ఇప్పుడు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అనేది ఉత్కంఠగా మారింది.. కాగా, కార్యకర్తలే నా హై కమాండ్.. వారే సుప్రీం అని మహానాడులో ప్రకటించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు.. ఇదే సమయంలో లోకేష్ 6 శాసనాలు ప్రవేశ పెట్టారు.. ఆయనకు ఉన్న నాలెడ్జితో మంచి ఆలోచనలు చేస్తున్నారు అని ప్రశంసలు కురిపించిన విషయం విదితమే.. ఇక, టీడీపీ కొత్తతరహా పరిపాలనకు శ్రీకారం చుట్టింది.. ఎప్పటికి అప్పుడు ప్రజాఅభిప్రాయం తీసుకుంటున్నాం అన్నారు.. కార్యకర్తలే అధినేతలుగా మహానాడు నిర్వహిస్తున్నాం.. కొన్ని నియోజకవర్గాల్లో ఓడినా మెజార్టీ వచ్చిందని వెల్లడించారు సీఎం చంద్రబాబు నాయుడు..

## ఆపరేషన్ సింధూర్ లోగోను రూపొందించింది వీరే

**న్యూఢిల్లీ,:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7న భారత సైన్యం పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సింధూర్' ప్రారంభించింది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాక్ కు తగిన బుద్ధి చెప్పింది. పాకిస్తాన్‌పై భారత్ తీసుకున్న చర్య గురించి చర్చతో పాటు, ఈ ఆపరేషన్ లోగో రూపకల్పన కూడా ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి రేపింది. కోట్లాది మంది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచిన ఆపరేషన్ సింధూర్ లోగో ఎవరు రూపొందించి ఉంటారబ్బా అని సెర్చ్ చేయడం ప్రారంభించారు. అయితే ఈ లోగోను రూపొందించింది అడ్వర్టైసింగ్ ప్రొఫెషనల్స్, బ్రాండింగ్ కంపెనీలు అనుకుంటే పొరపాటే. ఈ లోగోను ఇద్దరు భారత ఆర్మీ సైనికులు రూపొందించారు. ఆపరేషన్ సిందూర్ లోగోను లెఫ్టినెంట్ కల్నల్ హర్ష్ గుప్తా, హవల్దార్ సురీందర్ సింగ్ రూపొందించారు. ఈ లోగో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. మే 7న, పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత్ ఒక ఆపరేషన్ ప్రారంభించింది. లక్షిత దాడులు జరిగిన వెంటనే, భారత సైన్యం సోషల్ మీడియాలో ఆపరేషన్ సిందూర్ గురించి వెల్లడిస్తూ ఒక పోస్ట్ పోస్ట్ చేసింది. ఈ పోస్ట్ ద్వారా ఆపరేషన్ సింధూర్ లోగోను కూడా బహిరంగపరిచారు. ఆపరేషన్ సింధూర్ లోగోను మొదట సోషల్ మీడియాలో మే 7న తెల్లవారుజామున 1.51 గంటలకు పోస్ట్ చేశారు. లోగోలో త్యాగం, జాతీయ గర్వాన్ని సూచించే సింధూర గిన్నె ఉంటుంది. సిందూరంలోని "ఓ" అనేది సాంప్రదాయ సింధూర గిన్నె నుంచి తీసుకున్నారు. ఇది వివాహిత హిందూ మహిళల పవిత్ర చిహ్నం. దాని ముదురు ఎరుపు రంగు త్యాగం, న్యాయం, జాతీయ గర్వం గురించి చెబుతుంది.




# ఏఐ పరిస్థితి ఇంతే!.. ఉద్యోగులకు భయమేల



గత కొంతకాలంగా ఉద్యోగులను భయపెడుతున్న ఒకే ఒక అంశం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీ. దీనివల్ల ఉద్యోగాలు పోతాయని, ప్రపంచంలోని చాలా దేశాల్లో నిరుద్యోగం విపరీతంగా పెరుగుతుందని.. కొందరు నిపుణులు కూడా వెల్లడించారు. ఇందులో ఏ మాత్రం నిజం ఉంది?, నిజంగానే ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయా?, నివేదికలు ఏం చెబుతున్నాయనే.. విషయాలను ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. ఏఐ దాదాపు అన్ని రంగాల్లోనూ.. సంచనలం సృష్టించింది. దీంతో చాలామంది భయపడ్డారు. అయితే ప్రస్తుతం కొన్ని నివేదికలు మాత్రం ఊహించినదానికి భిన్నంగా ఉన్నాయని, ఉద్యోగాలు ఎక్కడికీ పోవని చెబుతున్నాయి. అమెరికా డేటా.. ఏఐ ఉన్నప్పటికీ ఏడాదిలో ఇంటర్?ప్రిటేషన్?, ట్రాన్స్?లేషన్?కి సంబంధించిన ఉద్యోగాలు ఏడు శాతం పెరిగాయని చెబుతోంది. మనుషులను ఏఐ రీప్లేస్ చేస్తుందని చెప్పిన కంపెనీలు కూడా.. ఇప్పుడు మనిషి అవసరం ఖచ్చితంగా ఉందని స్పష్టం చేస్తున్నాయి. సగటు ఉద్యోగులతో పోలిస్తే.. ఫ్రెషర్లు ఉద్యోగాలు పొందలేకపోతున్నారని అమెరికా డేటా వెల్లడించింది. ఏఐ రాకముందు కూడా ఫ్రెషర్స్ ఈ పరిస్థితులనే ఎదుర్కొన్నారు. అయితే ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలను నేర్చుకున్నవారికి తప్పకుండా ఉద్యోగాలు లభించకుండా ఉండే అవకాశం లేదు. చాలా కంపెనీలు ఏఐలను ఎంట్రీ లెవెల్ ఉద్యోగులు చేసే పనుల్లో ఉపయోగిస్తున్నాయి. మొత్తం మీద అమెరికాలో ఉద్యోగులు లభించని ఫ్రెషర్స్ కేవలం నాలుగు శాతం మంది మాత్రమే ఉన్నారు. యూఎస్ఏలో మాత్రమే కాకుండా.. ఇతర దేశాల్లో కూడా ఫ్రెషర్స్ పరిస్థితి ఇలాగే ఉంది. పరిస్థితులను చూస్తుంటే.. నిరుద్యోగులు పెరగడానికి లేదా ఉద్యోగాలు లభించకపోవడానికి కేవలం ఏఐ మాత్రమే కారణం చెప్పడానికి ఆస్కారం లేదు. బ్రిటన్, జపాన్ వంటి దేశాల్లో ఏఐ ఉన్నప్పటికీ.. ఉద్యోగుల జీతాలు కూడా భారీగానే పెరుగుతున్నాయి. దీన్నిబట్టి చూస్తుంటే.. ఉద్యోగులను తొలగించాలనే ఉద్దేశ్యం దాదాపు కంపెనీలకు లేదు, అంతే కాకుండా వారికి మంచి జీతాలను ఇవ్వడానికి కూడా ఏ మాత్రం వెనుకడుగు వేయడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. దిగ్గజ కంపెనీలన్నీ.. ప్రతి ఆపరేషన్?లోనూ ఏఐలను తీసుకొస్తామని చెబుతూనే ఉన్నాయి. అయితే ముఖ్యమైన పనులకు మాత్రం ఏఐలను ఉపయోగించడం లేదు. అమెరికాలో కేవలం 10 శాతం కంపెనీలు మాత్రమే ఏఐలను గూడ్స్ అండ్ సర్వీస్ కోసం విరివిగా వాడుతున్నారని తెలుస్తోంది. ఒకవేళ కంపెనీలు ఏఐలను తీసుకున్నప్పటికీ.. ఉద్యోగులను వదులుకోవడానికి మాత్రం సిద్ధంగా లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఏఐ మనిషిని రీప్లేస్ చేయదు,



మనిషితో కలిసి పనిచేస్తుంది, పని వేగంగా జరగడానికి సహాయం చేస్తుంది. కాబట్టి ఏఐ వల్ల ఉద్యోగాలు భారీగా పోతాయనేది కేవలం ఓ అపోహ మాత్రమే. ప్రస్తుతానికి ఉద్యోగులు నిశ్చితంగా ఉండవచ్చు, అయితే.. మారుతున్న ప్రపంచంలో మనగలగాలి అంటే.. టెక్నాలజీలో ,ముందుండాలన్న విషయాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో మర్చిపోకూడదు.

# ఏఐకి సవాళ్ల స్వాగతం

**నిపుణులు, పెట్టుబడుల కొరతతో ఇబ్బందులు**

**చిన్న నగరాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ వంటి సదుపాయాల కొరత**

**డేటానే కీలకం కావటంతో సవాళ్లు విసురుతున్న సైబర్ నేరాలు**

**ఉపాధిపై దెబ్బ, సామాజిక అసమానతలపై ఆందోళన**

హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో.. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ సరికొత్త టెక్నాలజీని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోంది. ఏఐ సిటీ నిర్మాణం, బిగ్‌డేటా, సైబర్ సెక్యూరిటీ వంటి టెక్నాలజీలకు ప్రభుత్వం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసింది. డేటా సైన్స్, నైపుణ్యం, పాలన, పరిశోధన, భాగస్వామ్యం, అనుసరణ అనే ఆరు అంశాలను మూల స్తంభాలుగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏఐ పాలసీని రూపొందించింది. అదే సమయంలో ఈ రంగంలో అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి.

### నిపుణుల కొరత..

డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి రంగాలలో రాష్ట్రంలో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఏఐ ప్రాజెక్టుల అమల్లో ఆలస్యంతోపాటు అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలతో పోటీ పడలేకపోతున్నామని రాష్ట్ర ఐటీ వర్గాలు చెబుతున్నాయి. ఏఐ అభివృద్ధిలో కీలకమైన అధిక కంప్యూటింగ్ శక్తి, హై-స్పీడ్ ఇంటర్నెట్, డేటా సెంటర్లు ద్వితీయ శ్రేణి నగరాల్లో అంతగా అభివృద్ధి చెందలేదు. దీంతో ఏఐ ఆవిష్కరణలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నాయి. ఏఐ వ్యవస్థలు పెద్ద ఎత్తున డేటాపై ఆధారపడుతుండటంతో గోప్యత, భద్రత అత్యంత కీలకంగా మారింది. డేటా ఉల్లంఘనలు, సైబర్ నేరాలు కూడా ఏఐ ఆచరణలో ప్రధాన సవాలుగా నిలుస్తున్నాయి.

### ఎగుమతులు, ఉపాధి కల్పన నేలచూపులు

కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు, ఈ రంగంలో కొత్త ఉద్యోగాల కల్పన వృద్ధిలో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. 2022-23లో ఐటీ ఎగుమతుల్లో రూ.57,706 కోట్ల పెరుగుదల నమోదు కాగా.. 2023-24లో రూ.26,948 కోట్ల పెరుగుదల మాత్రమే ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022-23లో ఐటీ రంగంలో కొత్తగా 1,27,594 ఉద్యోగాల కల్పన జరగ్గా, 2023-24లో 40,285కి పడిపోయాయి. ఈ తగ్గుదల ఏఐ సహా



ఐటీ రంగంలో కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఆటంకాలు సృష్టించిందనే వాదన వినిపిస్తోంది. ఏఐ ద్వారా ఆటోమేషన్ పెరిగి సంప్రదాయ ఉద్యోగాలు కోల్పోతామనే భయం ఐటీ ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

### స్టార్టప్‌లు, ఆవిష్కరణలే కీలకం

రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకున్న స్టార్టప్‌ల (6,873)లో సుమారు మూడు శాతం ఏఐ, ఎంఎల్ ఆధారిత స్టార్టప్‌లు (211) ఉన్నాయి. తెలంగాణ ఏఐ మిషన్ (టీ ఎయిమ్) ద్వారా 142 ఏఐ స్టార్టప్‌లకు మార్కెట్‌తో అనుసంధానం, ఆర్థిక సాయం, మార్గదర్శనం, అత్యాధునిక ఏఐ కంప్యూటింగ్ సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోంది. 2027 నాటికి 5 లక్షల మందికి (18-45 ఏళ్ల వయస్సు) ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.నాస్కామ్, మైక్రోసాఫ్ట్ తదితర సంస్థలతో కలిసి ఏటా 30 వేల మంది విద్యార్థులకు ఏఐ శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏఐని పాఠ్యాంశంగా చేర్చే ప్రణాళిక రూపొందిస్తోంది. ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అందుబాటులోకి తేవడం, 12 భారతీయ భాషల్లో ఏఐ అప్లికేషన్ల అభివృద్ధి, ప్రభుత్వ సేవల్లో ఏఐ సాంకేతిక వినియోగాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2024లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.2.68 లక్షల కోట్లు కాగా, 2025లో ఇందులో ఏఐ రంగం వాటాను 5 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

### పెట్టుబడులు పెరిగితేనే ఫలితాలు

మనకు విస్తృతమైన ఇంజనీరింగ్ ప్రతిభా సంపద ఉన్నప్పటికీ డేటాసైన్స్, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో కీలక నైపుణ్యాల కొరతను ఎదుర్కొంటున్నాం. ద్వితీయ శ్రేణి నగరాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు లేకపోతే మనం ఏఐ ఫలితాలను అందుకోలేం. స్థానిక భాషలు, సంస్కృతి, స్థానిక అవసరాలకు అనుగుణంగా స్వదేశీ లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు (ఎల్ఎల్ఎం)లు, జనరేటివ్ ఏఐ మోడళ్లను అభివృద్ధి చేయడంలో కూడా మనం వెనుకబడి ఉన్నాం. ఏఐ వాతావరణం హైదరాబాద్ లాంటి నగరాలకే పరిమితం కాకుండా ఇంకా విస్తరించాలి. ఏఐ విప్లవాన్ని మన సొంత రీతిలో మనమే నిర్వచించుకోవాలి.

### ఏఐతో ఉద్యోగాలకు ముప్పు లేదు

ఏఐ వల్ల సంప్రదాయ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నెమ్మదిగా, పునరావృతమయ్యే పనులను వేగంగా పూర్తి చేసేందుకు ఏఐ సాంకేతికత ఉపయోగపడుతుంది. ఏఐ విప్లవానికి నాయకత్వం వహించే సామర్థ్యం మనకు ఉంది. కానీ ఏఐ, డేటా సైన్స్, క్లౌడ్‌లో నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నాం. ఇది రాత్రికి రాత్రే పరిష్కారమయ్యే సమస్య కాదు. నైపుణ్య శిక్షణ, ఆచరణాత్మక విధానాలు, నిరంతర పెట్టుబడులతోనే ఈ సమస్యను అధిగమించగలం. ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు మాత్రమే ద్వితీయ శ్రేణి పట్టణాలు పరిమితం కాకుండా ఏఐ విప్లవంలో భాగస్వాములు కావాలి.

# బంగ్లాదేశ్‌లో ముసలం!



జవాబుదారీతనం లేని అధికారం అరాచకానికి దారితీస్తుంది. దేశ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుంది. బంగ్లాదేశ్‌లో నిరుడు ఆగస్టు తిరుగుబాటు తర్వాత జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఈ అభిప్రాయం కలుగుతుంది. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ఆర్థిక నిపుణుడు మహమ్మద్ యూనస్ ప్రధాన సలహాదారుగావున్న అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటున్నది. ఒకపక్క సత్ప్రవర్తన లేని ప్రభుత్వోద్యోగులకు త్వరగా ఉద్వాసన పలికేవిధంగా సర్వీసు నిబంధనలు మార్చటం, మరోపక్క అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలివ్వటంలో విఫలం కావటం వగైరాలు అసంతృప్తికి దారితీసి నాలుగు రోజులుగా దేశవ్యాప్తంగా సమ్మె సాగుతోంది. ఈలోగా అమెరికా ఒత్తిడికి లొంగి లోపాయకారీగా సెయింట్ మార్టిన్స్ దీవిని కట్టబెట్టేందుకు యూనస్ పావులు కదిపారు. అంతేకాదు... దాని ఆదేశాలతో చిట్ట గాంగ్-రఖినే కారిడార్‌ను 'మానవతా సాయం' అందించటానికి వీలుగా అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ రెండింటిపైనా దేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తంకావటంతో పాటు సైన్యం నుంచి సైతం వ్యతిరేకత వచ్చింది. పర్యవసానంగా పది నెలలకు పైగా బాధ్యత లేని అధికారం చలాయి స్తున్న ప్రభుత్వం చిక్కుల్లో పడింది. గత్యంతరంలేని స్థితిలో తన నిర్ణయాలను వెనక్కు తీసుకుంది. తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు దేశంలో వరస వైపరీత్యాలు చోటు చేసుకుంటున్నాయి. ఛాందసవాదులు కత్తులు కటార్లతో రోడ్లపైకొచ్చి ముస్లిం మహిళలు బురఖా ధరించాలని హుకుం జారీచేస్తూ హడావిడి మొదలుపెట్టారు. దాన్ని బేఖాతరు చేసిన మహిళలను నడిరోడ్డుపై దండించటం, జైళ్లపాలు చేయటం కొనసాగాయి. మైనారిటీ హిందువులపై దాడులు, దౌర్జన్యం, అక్రమ అరెస్టులు మామూలే. వీటని సరిదిద్దటానికి బదులు అంతా మీడియా సృష్టి అని యూనస్ దబాయింపులకు దిగారు. ఒకనాడు తూర్పు పాకిస్తాన్‌గా వున్న తమపై పాక్ పాలకుల అకృత్యాలను మరిచి, దాన్ని నెత్తినపెట్టుకోవటం మొదలుపెట్టారు. చైనాకు పోయి దాంతో మరింత సాన్నిహిత్యానికి ప్రయత్నించారు. దేశానికి పనికొచ్చేదేదో, ప్రయోజనకరమైనదేదో గ్రహించి నిర్ణయాలు తీసుకోవటం మాని భారత్‌ను చీకాకు పెట్టడమే లక్ష్యంగా యూనస్ వ్యవహారశైలివుంది. ఎల్లకాలమూ ఇలాగే సాగిపోతుందనుకుంటే చెల్లదు. పాత ప్రభుత్వం పతనమై పది నెలలు దాటుతున్నా ప్రభుత్వం ఎన్నికల గురించి ఆలోచించదేమన్న ప్రశ్నలు మొదలయ్యాయి. 2026 మధ్య వరకూ ఎన్నికలు జరిపే ఉద్దేశం లేదన్నట్టు యూనస్ ప్రభుత్వం ఈమధ్య లీకులిస్తుండగా,బంగ్లా ఆర్మీ చీఫ్ వాకర్-ఉజ్-జమాన్ ఈ ఏడాది ఆఖరిలోగా ఎన్నికలు జరిగి తీరాలని నిర్దేశించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకొస్తే తాము తిరిగి బ్యారక్‌లకు వెళ్లిపోతామని ఒక సభలో మాట్లా డుతూ ఆయన ప్రకటించారు. సహజంగానే ఇది యూనస్‌కు మింగుడు పడలేదు. అలాగని ప్రభు త్వాన్ని నడపటం ఆయనకు చేతకావటం లేదు. ప్రభుత్వంలోని మత ఛాందసవర్గం, విద్యార్థి నాయకులు చెప్పినట్టల్లా చేస్తూ ఆయన ఇప్పటికే ప్రతిష్ఠ పోగొట్టుకున్నారు. షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్‌ను నిషేధిస్తూ తీసుకున్న నిర్ణయం ఆ బాపతే. బంగ్లా అధీనంలోవున్న సెయింట్ మార్టిన్స్ దీవి వ్యూహాత్మకంగా కీలకమైనది. బంగాళాఖాతంలో మన దేశం, మయన్మార్ కూడా దీనికి సమీపంగా ఉంటాయి. పదివేలమంది బంగ్లా పౌరులు నివసించే ఈ దీవిలో సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకోవాలని అమెరికా ఏనాటి నుంచో కలలుగంటున్నది. హిందూ మహా సముద్రంలో డీగో గార్షియా దీవిలో స్థావరం ఉన్నా, బంగాళాఖాతంలో లేని లోటు దాన్ని పీడిస్తోంది. ఈ దీవిపై అమెరికా మాత్రమే కాదు... చైనా కన్ను కూడా పడింది. మయన్మార్ సైతం వీలైతే దాన్ని గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తోంది. అంతర్జాతీయ సాగర చట్టాల ట్రిబ్యునల్ 2012లో ఈ దీవి బంగ్లాదేశ్‌కు చెందుతుందని, 12 నాటికల్ మైళ్ల మేర ప్రాంతం ఆ దేశానిదేనని తీర్పునిచ్చినా అడపా దడపా మయన్మార్‌తో సమస్యలు తప్పడం లేదు. ఆ దేశ సైన్యం అక్కడ మసిలే బంగ్లా పౌరులను అపహరించటం, కాల్పులు జరపటం రివాజుగా మారింది. దీన్ని అమెరికాకూ లేదా చైనాకూ అప్పగిస్తే మన దేశ భద్రతకు ముప్పు కలుగుతుంది. కానీ యూనస్ భారత్‌పై వ్యతిరేకతతో ఈ దీవిని అమెరికాకు అప్పగించాలనుకున్నారు. ఈ ప్రతిపాదనను కూడా బంగ్లా సైన్యం తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ భవిష్యత్తును నిర్దేశించే ఇలాంటి కీలక నిర్ణయాలు ఎన్నికైన ప్రభుత్వానికే వదలాలని సూచించింది. అలాగే చిట్టగాంగ్-రఖినే కారిడార్ విషయంలోనూ సైన్యం పట్టుదలతో ఉంది. మయన్మార్‌లో సైనిక ముఠా ప్రభుత్వ దాడుల్లో చిక్కుకున్న రఖినే ప్రాంతానికి నిత్యావసరాలు, మందులు, ఆహారం అందించాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిన మాట వాస్తవం. అమెరికా సైతం ఈ కృషిలో పాలుపంచుకుంటామని తెలిపింది. అయితే ఈ మాటున కారిడార్ ఆనుపానులన్నీ అమెరికా తెలుసుకుంటుందన్నది బంగ్లా సైన్యం బెంగ. తన నిర్ణయాలను హసీనాయే కాదు... బీఎన్‌పీ నేత ఖలీదా జియా, సైన్యం, పౌర సమాజం తీవ్రంగా వ్యతిరేకించటంతో యూనస్‌కు ఎటూ పాలుపోలేదు. అందుకే రాజీనామా బెదిరింపులకు దిగారు. కానీ దానికెవరూ కంగారు పడిన దాఖలా లేకపోవటంతో వెనక్కి తగ్గారు. నిర్ణయాత్మకంగా వ్యవహరించటం చేతకాని తన వ్యవహారశైలితో బంగ్లాదేశ్‌ను ఏం చేద్దామనుకుంటున్నారో యూనస్ ఆలోచించుకోవాలి. నడమంత్రపు సిరిలా వచ్చిపడిన అధికారం అండతో దేశాన్ని భ్రష్టుపట్టించటం మానుకోవాలి. సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించటమే గౌరవప్రదమని గ్రహించాలి.

ప్రభాత సూర్యుడు
https://www.facebook.com/prabhathasuryudu
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక


సంపాదకీయం

# మళ్లీ కరోనా కలకలం

## (విశ్లేషణ)

మరోసారి కరోనా మహమ్మారి కలకలం సృష్టిస్తోంది. దేశంలో అంతకంతకూ పెరుగుతున్న కేసుల సంఖ్య సహజంగానే అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది. ఐదేళ్ల కిందట విశ్వమంతటా విస్తరించి, లక్షలాది ప్రాణాలను కబళించిన ఈ పెనువ్యాధి పేరు వింటే ఇప్పటికీ వెన్నులో వణుకు పుడుతుంది. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్-19 వైరస్‌కు బలైన వారి సంఖ్య 70 లక్షల పైచిలుకే. అంతటి ప్రాణాంతక వ్యాధి కోరలు సాచి వస్తోందంటే ఎవరికి మాత్రం భయం కలగదు? సింగపూర్, హాంకాంగ్ దేశాలలో మొదలైన ఈ వైరస్ వ్యాప్తి రెండు వారాలు గడిచేసరికి ఇండియా గడప దాటి లోపలకు ప్రవేశించింది. ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలలో పదుల సంఖ్యలో ఈ వైరస్ బారినపడినట్లు వార్తలు వినవస్తున్నాయి. ఒక్క కేరళలోనే 430 కేసులు బయటపడినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఒక వైద్యుడికే కరోనా సోకినట్లు వచ్చిన వార్తలు కలవరం కలిగిస్తున్నాయి. ఇప్పటివరకూ వెయ్యికి పైగానే కేసులు వెలుగు చూసినట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ లెక్కగట్టింది. గతంలో మారణహోమం సృష్టించిన ఒమిక్రాన్ వైరస్సే ఇప్పుడూ వ్యాపిస్తున్నా, దాని ఉప వేరియంట్లే ప్రధానంగా వ్యాప్తిలో ఉన్నాయని, వాటివల్ల ప్రమాద తీవ్రత అంతగా ఉండదనీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) డైరెక్టర్ జనరల్ స్వయంగా పేర్కొనడం ఉపశమనం కలిగించే విషయం. ఒకప్పుడు రెండు రోజుల్లోనే వైరస్‌ల సంఖ్య రెట్టింపు అయ్యేవి. కాగా ప్రస్తుతం వాటి వ్యాప్తిలోనూ, సంఖ్యలోనూ వేగం కనిపించడం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎల్ఎఫ్ 7, ఎన్ బి 1.8.1 అనే కొత్త వేరియంట్లు ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నట్లు ఇండియన్ జెనోమ్ కన్సార్షియం గుర్తించింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ సైతం ఇప్పటివరకూ ఎలాంటి మార్గదర్శకాలూ విడుదల చేయకపోవడాన్ని బట్టి చూస్తే ఇప్పటి వైరస్ ప్రభావం అంతంత మాత్రమేనని స్పష్టమవుతోంది. వాతావరణ పరిస్థితులు, సామూహికంగా మసలడం, ప్రయాణాలు పెరగడం వంటివి కేసుల పెరుగుదలకు కారణం కావచ్చునేది వైద్యనిపుణుల అనుమానం. గతంలో కోవిడ్ ప్రబలినప్పుడు అంతా అయోమయ వాతావరణం నెలకొని ఉండేది. ఏ జబ్బో, ఎలా సోకిందో అర్థం కావడానికి చాలా రోజులు పట్టింది. కరోనా వైరస్‌ను గుర్తించేలోగానే ఒకరినుంచి ఒకరికి పాకి, ప్రపంచమంతటా విస్తరించి మానవాళిని చుట్టుముట్టి ప్రాణాలు బలితీసుకుంది.అకస్మాత్తుగా ఊడిపడిన ఈ వైరస్ భరతం పట్టే విధంగా వ్యాక్సిన్ రూపొందించేందుకూ చాలా రోజులే పట్టింది. కరోనా నేర్పిన గుణపాఠాలతో ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్య పరిశోధనా సంస్థలు సైతం చెట్టుకొకటి, పుట్టకొకటిగా పుట్టుకొస్తున్న ప్రాణాంతక వైరస్‌లపై అనుక్షణం ఒక కన్నువేసి ఉంచుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వ్యాపిస్తున్న కరోనా వైరస్ వల్ల అంతగా ప్రమాదం లేదంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు కేంద్ర ఆరోగ్య వైద్యశాఖ ఇస్తున్న భరోసాను విశ్వసించవచ్చు. అలాగే, ప్రస్తుతం కరోనా బారినపడినవారు రుచి, వాసన కోల్పోకపోవడం ఊరట కలిగించే విషయం. అలాగని ప్రాథమిక జాగ్రత్తలు పాటించకపోవడం ప్రాణాంతకంగా పరిణమించవచ్చు. వ్యక్తిగత శుభ్రత పాటించడం, ఒకరినుంచి ఒకరు కనీసం ఐదారు అడుగుల దూరం మసలడం, మాస్కు ధరించడం, వీలైనంత వరకూ సామూహిక ప్రయాణాలకు స్వస్తి చెప్పడం వంటి స్వీయ జాగ్రత్తలు పాటించడం అత్యవసరం. దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికీ ఈ వైరస్ సోకే ప్రమాదం ఉందంటూ వైద్య నిపుణులు చేస్తున్న హెచ్చరికలు గమనార్హం. గొంతు నొప్పి, దగ్గు, అలసట, జ్వరం వంటి కరోనా ప్రాథమిక లక్షణాలు ఉన్నట్లు గమనిస్తే, వెంటనే వైద్యుల్ని సంప్రదించడం ఉత్తమం. నిర్లక్ష్యం చేస్తే పక్కనున్నవారికి కూడా వైరస్ సోకే ప్రమాదం ఉందన్న సంగతి విస్మరించరాదు.మరోవైపు ప్రభుత్వాలు సైతం కరోనా వైరస్ నివారణకు వినియోగించే మందులతో ఆస్పత్రులను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిపుష్టం చేయాలి. కీడెంచి మేలెంచమన్నట్లు ప్రస్తుతానికి బూస్టర్ డోస్‌లు అవసరం లేదని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ చెబుతున్నా, పరిస్థితి చేయి దాటితే వినియోగించేందుకు టీకాలను సిద్ధంగా ఉంచడం మేలు. గతంలో టీకాలు తీసుకోనివారిని గుర్తించి వారికి తక్షణం టీకాలు ఇప్పించేందుకు కార్యాచరణ ఆరంభించాలి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధుల విజృంభణ పెరుగుతుందన్న వాస్తవాన్ని గమనంలో ఉంచుకుని, వైద్య ఆరోగ్య శాఖాధికారులు నడుం బిగించడం శ్రేయస్కరం.

# ఈ సారి మరింత భయంకరంగా కరోనా..?
# బాబా వంగా చెప్పినట్టే జరిగి తీరుతుందా..?





భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ కేసుల వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో మరోసారి బాబా వంగా అంచనాల గురించి చర్చ మొదలైంది. 2030లో కొత్త వైరస్ చాలా తీవ్రంగా వ్యాపిస్తుందని బాబా వంగా అంచనా వేశారు. కానీ, కరోనా వైరస్ అంతకు ముందే వ్యాప్తి చెందుతోంది. భవిష్యత్తు గురించి బాబా వంగా వేసిన పలు అంచనాలు ఇప్పటికే నిజం అయ్యాయి. ఇప్పుడు ఈ కరోనా విషయంలో కూడా ఆమె చెప్పిందే జరుగుతుందేమో అనే భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. చిన్న వయసులోనే చూపు కోల్పోయిన బాబా వంగా భవిష్యత్తు సంఘటనలను కచ్చితంగా అంచనా వేస్తారు. ఆమె చనిపోయే ముందు రాబోయే సంవత్సరాల్లో ఏం జరుగుతుందో పేర్కొన్నారు. ఇప్పుడు కరోనా గురించి మాట్లాడుకుంటే.. 1999లో జపనీస్ రచయిత రియో ??టాట్సుకి "ది ఫ్యూచర్ యాజ్ ఐ సీ ఇట్" అనే పుస్తకాన్ని రాశారు. అందులో కరోనా గురించి కొన్ని అంచనాలను రాశారు.

"ఒక తెలియని వైరస్ ఏప్రిల్ 2020 లో వస్తుంది. అది ఏప్రిల్ లో గరిష్ట స్థాయికి చేరుకుని ఆ తర్వాత అదృశ్యమవుతుంది. ఆ తర్వాత 10 సంవత్సరాలకు 2030 లో వైరస్ మళ్ళీ గరిష్ట స్థాయికి చేరుకొని దాని ఉగ్రరూపం చూపిస్తుందని పేర్కొన్నారు. వైరస్ చాలా తీవ్రమైనది. ఇందులో ఎక్కువ మంది చనిపోతారు. ఇది మరోసారి ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలను దెబ్బతీస్తుందని ప్రస్తావించారు. 2030కి ఇంకా 4 సంవత్సరాలు దూరంలో ఉన్నందున, వైరస్ ప్రభావం పెరుగుతోందని కూడా ఆయన ఎత్తి చూపారు.

**బాబా వంగా ఆశ్చర్యకరమైన అంచనాలు**

అంతకుముందు, బాబా వంగా సునామీ గురించి హెచ్చరించారు. 2025 జూలైలో జపాన్, ఫిలిప్పీన్స్‌లను పెను సునామీ తాకుతుందని అంచనా వేశారు. ఇది 2011 విపత్తు కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని బాబా వంగా అంచనా వేశారు. జపాన్, తైవాన్, ఇండోనేషియా, ఉత్తర మరియానా దీవులు సముద్ర అల్లకల్లోలానికి, భూకంపాలకు గురవుతాయని ఆయన అంచనా వేశారు.

**వెయ్యి దాటిన కరోనా కేసులు**

భారతదేశంలో ప్రస్తుతం 1009 మందికి కరోనా వైరస్ సోకింది. వీరిలో కేరళ, మహారాష్ట్రలలోనే 430 మందికి వైరస్ సోకింది. ఆ తరువాత తమిళనాడులో 69 మంది, కర్ణాటకలో 47 మంది, గుజరాత్‌లో 83 మంది, రాజస్థాన్‌లో 13 మంది, పశ్చిమ బెంగాల్‌లో 12 మంది కరోనా వైరస్ బారిన పడ్డారు.

ప్రస్తుత కరోనా వైరస్ వ్యాప్తి తీవ్రమైనది కాదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ చెప్పడం గమనార్హం.

# భారత్‌కు డేంజర్ న్యూస్ చెప్పిన అమెరికా ఇంటెలిజెన్స్!
# పాకిస్థాన్, చైనా నుంచి ముప్పు..

2025 వరల్డ్ థ్రెట్ అసెస్‌మెంట్ అనే పేరుతో ఇటీవల విడుదలైన యుఎస్ ఇంటెలిజెన్స్ నివేదిక ఇండియాకు డేంజర్ బెల్స్ మోగించింది. చైనా, పాకిస్తాన్ నుంచి ఇండియాకు ముప్పు పొంచి ఉందని నివేదిక పేర్కొంది. భారత్ ఎదుర్కొంటున్న రెండు ముఖ్యమైన భద్రతా సవాళ్లను కూడా ప్రస్తావించింది. చైనా, పాక్.. భారత్‌కు వ్యతిరేకంగా తమ సైనిక సామర్థ్యాలను ఆధునీకరించడానికి, విస్తరించడానికి చేస్తున్న ప్రయత్నాలను నొక్కి చెబుతుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత వచ్చిన ఈ నివేదిక భారత్ అభివృద్ధి చెందుతున్న రక్షణ వైఖరిని అంచనా వేస్తుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత్ ప్రపంచ స్థాయిని బలోపేతం చేయడం, దాని సైనిక బలాన్ని బలోపేతం చేయడం, చైనా పెరుగుతున్న ప్రభావాన్ని ఎదుర్కోవడంపై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇది పేర్కొంది. భారత్ చైనాను తన ప్రాథమిక వ్యూహాత్మక ప్రత్యర్థిగా చూస్తుండగా, మే మధ్యలో ఇటీవల సరిహద్దు శత్రుత్వాలు ఉన్నప్పటికీ, పాకిస్తాన్‌ను నిరంతర శత్రువుగా చూస్తున్నారని నివేదిక పేర్కొంది.



**పాకిస్తాన్ సైనిక ఆధునీకరణ**

సరిహద్దు ఉద్రిక్తతలను నిర్వహించడం, తెహ్రిక్-ఇ తాలిబన్ పాకిస్తాన్, బలూచ్ తిరుగుబాటుదారుల వంటి సమూహాల నుండి దేశీయ ఉగ్రవాద ముప్పులను ఎదుర్కోవడం, దాని అణ్వాయుధ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం వంటి రాబోయే సంవత్సరంలో పాకిస్తాన్ కీలకమైన రక్షణ ప్రాధాన్యతలను ఈ అంచనా వివరిస్తుంది.

2024లో మాత్రమే ఉగ్రవాద దాడుల వల్ల పాకిస్తాన్ అంతటా 2,500 మందికి పైగా మరణించారు. పాకిస్తాన్ భారతదేశాన్ని ఒక ప్రాథమిక ముప్పుగా చూస్తూనే ఉంది. అందువల్ల భారత్‌ను ఎదుర్కొవడానికి వ్యూహాత్మక అణ్వాయుధాల అభివృద్ధితో సహా దాని అణ్వాయుధ వ్యూహాన్ని మెరుగుపరచడానికి ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది.

ప్రధానంగా చైనా, యూఏఈ, టర్కీ, హాంకాంగ్, సింగపూర్ వంటి ఇతర మధ్యవర్తిత్వ దేశాలతో అనుసంధానించబడిన నెట్‌వర్క్‌ల ద్వారా పాకిస్తాన్ సున్నితమైన పదార్థాలు, సాంకేతికతను పొందడం గురించి ఆందోళనలను కూడా ఈ నివేదిక హైలైట్ చేస్తుంది.

**చైనా..**

ఈ నివేదిక చైనా ఏం చేస్తుందో కూడా స్పష్టం చేసింది. ఆ దేశం అమెరికాకు అత్యంత సమగ్రమైన సైనిక ముప్పుగా అభివర్ణిస్తుంది. చైనా తన సైన్యాన్ని భూమి, వాయు, సముద్రం, సైబర్, అంతరిక్షం వంటి అన్ని రంగాలలో వేగంగా అప్‌గ్రేడ్ చేస్తోంది. తూర్పు ఆసియాలో ఆధిపత్యాన్ని సాధించడం, తైవాన్‌ను ప్రధాన భూభాగంతో ఏకం చేయడం, ప్రపంచ స్థాయిలో అమెరికాను సవాలు చేయడం బీజింగ్ లక్ష్యం అని నివేదిక సూచిస్తుంది. చైనా అణ్వాయుధాల నిల్వలు 600 ఆపరేషనల్ వార్‌హెడ్‌లను అధిగమించాయని అంచనా వేసింది. 2030 నాటికి 1,000 దాటుతుందని అంచనా. ఉపగ్రహ, నిఘా వ్యవస్థలలో అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బతీసేందుకు ఆ దేశం అంతరిక్ష ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాలలో కూడా భారీగా పెట్టుబడులు పెడుతోంది. చైనా, పాకిస్తాన్ రెండూ కీలకమైన భౌగోళిక రాజకీయ ఘర్షణ కేంద్రాలుగా కొనసాగుతున్నాయని, రాబోయే సంవత్సరాల్లో ప్రాంతీయ, ప్రపంచ భద్రతా గతిశీలతను గణనీయంగా రూపొందిస్తాయని నివేదిక తేల్చింది.

# రైతులకు మరో కానుక ప్రకటించిన మోదీ సర్కార్..
# ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర పెంపు



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు మరో బహుమతిని ప్రకటించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను పెంచారు. పంటల పెట్టుబడిపై కనీసం 50 శాతం లాభాలు ఉండేలా కనీస మద్దతు ధరను నిర్ణయించారు. వరికి క్వింటాకు రూ. 69 కనీస మద్దతు ధర పెంచారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లోని బద్వేల్-నెల్లూరు మధ్య నాలుగు లేన్ల హైవే నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం(మే 28) జరిగిన మంత్రివర్గ సమావేశంలో, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. కేబినెట్ సమావేశంలో మరో ఐదు ముఖ్యమైన నిర్ణయాలకు ఆమోదం లభించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వీటిలో రైతులకు సంబంధించి మూడు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. బద్వేల్-నెల్లూరు మధ్య నాలుగు లేన్ల హైవే నిర్మాణంతో నాలుగు ఇండస్ట్రియల్ కారిడార్లకు కనెక్టివిటీ పెరుగుతుందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. హైవే నిర్మాణానికి రూ. 3,653 కోట్లు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. వార్ధా-బల్లార్షా రైల్వే మార్గాన్ని నాలుగు లేన్లుగా విస్తరించబోతున్నట్లు పేర్కొన్నారు. 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంపుదలకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచిందని, తద్వారా ఉత్పత్తిదారులకు వారి ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలు లభించేలా చూడవచ్చని ఆయన అన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే అత్యధికంగా %మీరా% పెరుగుదల నైజర్ సీడ్ (క్వింటాకు రూ. 820), ఆ తరువాత రాగి (క్వింటాకు రూ. 596), పత్తి (క్వింటాకు రూ. 589), నువ్వులు (క్వింటాకు రూ. 579) ఉన్నాయి. 2025-26 మార్కెటింగ్ సీజన్‌కు ఖరీఫ్ పంటలకు %మీరా% పెరుగుదల 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా ఉందని, ఇది అఖిల భారత సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 1.5 రెట్లు మద్దతు ధరని నిర్ణయించినట్లు ఆయన అన్నారు. రైతులు తమ ఉత్పత్తి వ్యయం కంటే ఆశించే మార్జిన్ చిరు ధాన్యాలు (63%), తరువాత మొక్కజొన్న (59%), కంది (59%), మినుములు (53%) విషయంలో అత్యధికంగా ఉంటుందని కేంద్ర మంత్రి అన్నారు. మిగిలిన పంటలకు, రైతులకు వారి ఉత్పత్తి వ్యయంపై 50% లాభం ఉంటుందని ఆయన అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన వడ్డీ సబ్సిడీ పథకం కింద వడ్డీ సబ్సిడీ భాగాన్ని కొనసాగించడానికి ఆమోదం లభించిందని, అవసరమైన నిధుల ఏర్పాటుకు ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. %వీఖూా% అనేది కేంద్ర రంగ పథకం, ఇది కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా రైతులకు సరసమైన వడ్డీ రేట్లకు స్వల్పకాలిక రుణాల లభ్యతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద, రైతులు కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా 7% రాయితీ వడ్డీ రేటుతో రూ. 3 లక్షల వరకు స్వల్పకాలిక రుణాలను పొందుతారు. అర్హత కలిగిన రుణ సంస్థలు 1.5% వడ్డీ సబ్సిడీని అందిస్తాయి. అదనంగా, సకాలంలో రుణం తిరిగి చెల్లించే రైతులు ప్రాంప్ట్ రీపేమెంట్ ఇన్సెంటివ్ గా 3% వరకు ప్రోత్సాహకానికి అర్హులు, దీని వలన %ఖజజ% రుణంపై వారి వడ్డీ రేటు 4% కి చేరుకుంటుంది. దేశంలో 7.75 కోట్లకు పైగా %ఖజజ% ఖాతాలు ఉన్నాయి. వ్యవసాయానికి సంస్థాగత రుణ ప్రవాహాన్ని కొనసాగించడానికి ఈ మద్దతును కొనసాగించడం చాలా కీలకం. ఇది ఉత్పాదకతను పెంచడానికి, చిన్న-సన్నకారు రైతులకు ఆర్థిక చేరికను నిర్ధారించడానికి చాలా ముఖ్యమైనది.

రహదారులకు ఆమోదం

కేంద్ర కేబినెట్ సమావేశంలో అనేక రహదారులకు ఆమోదం లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం ఓడరేవు వరకు 4 లైన్ల హైవేకు ఆమోదం తెలిపినట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. దీనితో పాటు, బద్వేల్-నెల్లూరు వరకు కొత్త రహదారిని నిర్మిస్తారు. తర్లాం నుండి నాగ్డా రైల్వే వరకు 4 లైనింగ్‌లు చేయడానికి ఆమోదం లభించింది. రూ. ఈ 41 కి.మీ. పొడవైన లైన్ కోసం 1,018 కోట్లు ఆమోదించింది కేబినెట్. దీంతో ముంబై నుండి ఢిల్లీ కారిడార్ సామర్థ్యం పెరుగుతుంది.

రెండు మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

రైల్వే లైన్ సామర్థ్యాన్ని పెంచే క్రమంలో, ప్రయాణీకులు, వస్తువుల రవాణాను సజావుగా, వేగంగా ఉండేలా భారతీయ రైల్వేలలో రెండు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులను ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. రత్లాం-నాగ్డా 3వ, 4వ లైన్లు, వార్ధా-బల్హార్షా 4వ లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ. 3,399 కోట్లు. ఇది 2029-30 నాటికి పూర్తవుతుంది. ఈ ప్రాజెక్టులు %ూవీ%-గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఫర్ మల్టీ-మోడల్ కనెక్టివిటీ ఫలితంగా ఉన్నాయి. ఇది సమగ్ర ప్రణాళిక ద్వారా సాధ్యమైంది. ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు సజావుగా కనెక్టివిటీని అందిస్తుంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని నాలుగు జిల్లాలను కవర్ చేసే ఈ రెండు ప్రాజెక్టులు భారతీయ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్క్‌ను దాదాపు 176 కి.మీ.ల మేర విస్తరిస్తాయి. ప్రతిపాదిత మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్ట్ కనెక్టివిటీని పెంచుతుంది. 784 గ్రామాలు, వీటి జనాభా దాదాపు 19.74 లక్షలు.

# ప్లే ఆఫ్స్‌లో ఆర్సీబీ చరిత్ర ఇదీ..!



ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలవడం ద్వారా క్వాలిఫయర్-1లో పోటీ పడే అవకాశాన్ని (ఇక్కడ గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుతుంది) కూడా దక్కించుకుంది. క్యాష్ రిచ్ లీగ్‌లో ఆర్సీబీ ప్లే ఆఫ్స్‌కు చేరడం ఇది పదోసారి.

ఇన్ని ప్రయత్నాల్లో ఆ జట్టు ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేక పోయింది. మూడు సందర్భాల్లో (2009, 2011, 2016) ఫైనల్ వరకు చేరినా రిక్తహస్తాలతో వెనుదిరిగింది. ఐపీఎల్ చరిత్రలో 15 ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ.. ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి, పదింట ఓడింది. ప్లే ఆఫ్స్‌లో ఆర్సీబీని అత్యంత దురదృష్టమైన జట్టు అని అంటారు. లీగ్ దశలో చెలరేగి ఆడే ఈ జట్టు నాకౌట్ మ్యాచ్‌లు వచ్చే సరికి ఢీలా పడిపోతుంది. గతమంతా ఇలాగే సాగింది.

కానీ ఈ సారి పరిస్థితి కాస్త భిన్నంగా కనిపిస్తుంది. ఆర్సీబీ ఈ సీజన్‌లో చాలా కాన్ఫిడెంట్‌గా ఉంది. ఇందుకు నిన్న (మే 27) లక్నోతో జరిగిన మ్యాచే నిదర్శనం. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 228 పరుగుల భారీ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. సూపర్ ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లి వికెట్ సహా నాలుగు వికెట్లు కోల్పోయినా ఏ మాత్రం ఒత్తిడికి లోనుకాకుండా అబ్బురపడే విజయం సాధించింది. జితేశ్ శర్మ (33 బంతుల్లో 85 నాటౌట్‌బీ 8 ఫోర్లు, 6 సిక్సర్లు) వీరోచితమైన ఇన్నింగ్స్ ఆడి ఆర్సీబీని గెలిపించాడు. ఈ గెలుపుతో ఆర్సీబీ క్వాలిఫయర్-1లో పోటీపడే అవకాశాన్ని దక్కించుకుంది. మే 29న జరిగే ఈ పోటీలో ఆర్సీబీ టేబుల్ టాపర్ పంజాబ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఆర్సీబీకి మరో అవకాశం ఉంటుంది. జూన్ 1న జరిగే క్వాలిఫయర్-2లో పోటీ పడే ఛాన్స్ ఉంటుంది. గుజరాత్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజేతతో ఆర్సీబీ క్వాలిఫయర్-2లో తలపడుతుంది.

**ప్లే ఆఫ్స్‌లో ఆర్సీబీ ప్రస్తానం..**

2009- ఫైనల్లో డెక్కన్ ఛార్జర్స్ చేతిలో 6 పరుగుల తేడాతో ఓటమి

2010- సెమీఫైనల్లో ముంబై ఇండియన్స్ చేతిలో 35 పరుగుల తేడాతో ఓటమి

2011- ఫైనల్లో సీఎస్‌కే చేతిలో 58 పరుగుల తేడాతో ఓటమి

2015- క్వాలిఫయర్-2లో సీఎస్‌కే చేతిలో 3 వికెట్ల తేడాతో ఓటమి

2016- ఫైనల్లో సన్‌రైజర్స్ చేతిలో 8 పరుగుల తేడాతో ఓటమి

2020- ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ చేతిలో 6 వికెట్ల తేడాతో ఓటమి

2021- ఎలిమినేటర్‌లో కేకేఆర్ చేతిలో 4 వికెట్ల తేడాతో ఓటమి

2022- క్వాలిఫయర్-2లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 7 వికెట్ల తేడాతో ఓటమి

2024- ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 4 వికెట్ల తేడాతో ఓటమి

2025- క్వాలిఫయర్-1లో పంజాబ్ ప్రత్యర్థి

# కోహ్లి సరికొత్త చరిత్ర.. ప్రపంచ క్రికెట్‌లో ఒకే ఒక్కడు



ఐపీఎల్-2025లో టీమిండియా స్టార్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లెజెండ్ విరాట్ కోహ్లి పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా సోమవారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో కోహ్లి అద్భుతమైన హాఫ్ సెంచరీతో చెలరేగాడు. 228 పరుగుల భారీ లక్ష్య చేధనలో ప్రత్యర్థి బౌలర్లను కోహ్లి ఉతికారేశాడు. కేవలం 30 బంతులు మాత్రమే ఎదుర్కొన్న కోహ్లి 10 ఫోర్ల సాయంతో 54 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో మెరిసిన కింగ్ కోహ్లి పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.

కోహ్లి సాధించిన రికార్డులు ఇవే..

ఐపీఎల్‌లో అత్యధిక అర్ధ సెంచరీలు సాధించిన ప్లేయర్‌గా కోహ్లి రికార్డులెక్కాడు. కోహ్లి ఇప్పటివరకు 63 హాఫ్ సెంచరీలు ఐపీఎల్‌లో సాధించాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ పేరిట ఉండేది. వార్నర్ ఐపీఎల్‌లో 62 అర్ధ శతకాలు నమోదు చేశాడు. తాజా హాఫ్ సెంచరీతో వార్నర్‌ను కోహ్లి అధిగమించాడు. ఈ ఫీట్‌ను కోహ్లి 257వ ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో అందుకోగా.. వార్నర్ కేవలం 184 ఇన్నింగ్స్‌లలోనే సాధించాడు. అదేవిధంగా టీ20 క్రికెట్‌లో ఓ జట్టు తరుపున 9వేల పరుగుల మైలురాయిని చేరుకున్న ఏకైక ఆటగాడిగా కోహ్లి చరిత్ర సృష్టించాడు. లక్నో మ్యాచ్‌లో 24 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కోహ్లి ఈ ఫీట్ నమోదు చేశాడు. ఐపీఎల్‌తో పాటు ఛాంపియన్స్ లీగ్‌టీ20తో కలిపి కోహ్లి ఆర్సీబీ తరుపున 9వేల పరుగులు సాధించాడు. ఈ జాబితాలో రెండో స్థానంలో రోహిత్ శర్మ ఉన్నాడు. రోహిత్ ముంబై ఇండియన్స్ తరుపన 6060 పరుగులు చేశాడు.

టీ20 క్రికెట్‌లో ఓ జట్టు తరుపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు వీరే..

విరాట్ కోహ్లి (ఆర్సీబీ) %-% 9030 పరుగులు

రోహిత్ శర్మ (ముంబై ఇండియన్స్) %-% 6060 పరుగులు

జేమ్స్ విన్స్ (హాంప్‌షైర్) %-% 5934 పరుగులు

సురేశ్ రైనా (సీఎస్‌కే) %-% 5529 పరుగులు

ఎంఎస్ ధోని (సీఎస్‌కే) %-% 5314 పరుగులు

ఐపీఎల్ సీజన్లలో అత్యధిక సార్లు 600 పరుగులు చేసిన ఆటగాడిగా కోహ్లి రికార్డు సృష్టించాడు. కోహ్లి ఇప్పటివరకు ఐదు సీజన్లలో 600కు పైగా పరుగులు చేశాడు. ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటివరకు 13 మ్యాచ్‌లు ఆడి 602 పరుగులు చేశాడు.

# SPORTS

## భారత-ఎ జట్టు నుంచి తప్పుకున్న శుబ్‌మన్ గిల్..!




ఇంగ్లండ్-భారత్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు సమయం అసన్నమవుతోంది. జూన్ 20 నుంచి ఈ హైవోల్టేజ్ సిరీస్ ప్రారంభం కానుంది. అయితే ప్రధాన సిరీస్‌కు ముందు భారత-ఎ జట్టు ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనాధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. తొలి టెస్టు మే 30 నుంచి జూన్ 2 వరకు కాంటర్బరీ వేదికగా, రెండో టెస్టు నార్తాంప్టన్‌లో జూన్ 6 నుంచి 9 వరకు జరగనున్నాయి. అయితే ఈ అనాధికారిక టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియా కొత్త టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇండియా- ఎ జట్టు నుంచి తప్పు కోవాలని గిల్ నిర్ణయించుకున్నట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. ఈ సిరీస్‌కు ఎంపిక చేసిన భారత-ఎ జట్టులో గిల్ సభ్యునిగా ఉన్నాడు. ఇంగ్లండ్ కండీషన్స్‌కు అలవాటు పడేందుకు గిల్‌కు ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఉపయోగపడతాయని సెలక్టర్లు భావించారు.

ఐపీఎల్ ప్లే ఆఫ్స్ కారణంగా తొలి వార్మాప్ మ్యాచ్‌కు గిల్ దూరంగా ఉంటాడని, రెండవ ప్రాక్టీస్ మ్యాచ్ కోసం ఇండియా-ఎ జట్టులో చేరతారని భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తెలిపాడు. కానీ ఇప్పుడు గత కొన్ని రోజుల నుంచి నిర్విరామంగా క్రికెట్ ఆడుతున్న గిల్‌కు విశ్రాంతి ఇవ్వాలని సెలక్టర్లు కూడా యోచిస్తున్నట్లు సమాచారం. ఇక ఇప్పటికే భారత-ఎ జట్టు ఇంగ్లండ్‌కు పయనమైంది. ఈ జట్టు కెప్టెన్‌గా దేశవాళీ దిగ్గజం అభిమన్యు ఈశ్వరన్ వ్యవహరించనున్నాడు. జూన్ 13 నుంచి బెకెన్‌హామ్ వేదికగా మూడు రోజుల పాటు జరిగే ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో గిల్ పాల్గోనే అవకాశముంది.

**ఇంగ్లండ్ పర్యటనకు భారత- ఎ జట్టు:**

అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధృవ్ జురెల్ (వైస్ కెప్టెన్), నితీష్ కుమార్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), మానవ్ సుతార్, తనుష్ కోటియన్, ముఖేష్ కుమార్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్‌పాండే, హర్ష్ దూబే

## టీమిండియాతో టెస్టు సిరీస్.. ఇంగ్లండ్‌కు ఊహించని షాక్

టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ ఊహించని షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఫాస్ట్ బౌలర్ గస్ అట్కిన్సన్ గాయం బారిన పడ్డాడు. జింబాబ్వేతో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో అట్కిన్సన్ తొడ కండరాలు పట్టేశాయి.

అతడు గాయం నుంచి కోలుకోవడానికి రెండు వారాల సమయం పట్టనున్నట్లు తెలుస్తోంది. అతడు ప్రస్తుతం ఇంగ్లండ్ క్రికెట్ వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నాడు. ఈ క్రమంలో వెస్టిండీస్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు అట్కిన్సన్ దూరమయ్యాడు.

అతడు విండీస్‌తో టీ20లలో కూడా ఆడేది అనుమానమే. కాగా జూన్ 20న ప్రారంభమయ్యే భారత్-ఇంగ్లండ్ టెస్టు సిరీస్ సమయానికైనా 27 ఏళ్ల గస్ అట్కిన్సన్ ఫిట్‌నెస్ సాధిస్తాడో లేదో వేచి చూడాలి. కాగా విండీస్‌తో వన్డేలకు ఇంగ్లండ్ క్రికెట్ జట్టు ఇప్పటికే స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ సేవలను కోల్పోయింది.

గాయం కారణంగా ఆర్చర్ విండీస్ టూర్‌కు దూరమయ్యాడు. అతడి స్థానాన్ని లూక్ వుడ్‌తో ఇంగ్లండ్ సెలక్టర్లు భర్తీ చేశారు. ఇక ఇంగ్లండ్-విండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్ గురువారం నుంచి ప్రారంభం కానుంది.



ఇంగ్లండ్ వన్డే జట్టు:

హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్, విల్ జాక్స్, జో రూట్, బెన్ డకెట్, జోఫ్రా ఆర్చర్, గుస్ అట్కిన్‌సన్, టామ్ బాంటన్, జేకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్, టామ్ హార్ట్‌లే, సాకిబ్ మహమూద్, మాథ్యూ పాట్స్, జేమీ ఒవర్టన్, ఆదిల్ రషీద్, జేమీ స్మిత్.

ఇంగ్లండ్ టీ20 జట్టు:

హ్యారీ బ్రూక్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జేకబ్ బెథెల్, టామ్ బాంటన్, జోస్ బట్లర్, బ్రైడన్ కార్స్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, సాకిబ్ మహమూద్, మాథ్యూ పాట్స్, జేమీ ఒవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, ల్యూక్ వుడ్.




మేటి ఆటగాళ్ల పోరులో అల్కరాస్‌దే పైచేయి. అద్భుతమే చేశాడు ఈ డిఫెండింగ్ ఛాంపియన్. ప్రతికూల పరిస్థితుల్లో అసాధారణ పోరాటపటిమను ప్రదర్శిస్తూ ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను మరోసారి చేజిక్కించుకున్నాడు. హోరాహోరీ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సినర్‌ను అల్కరాస్ మట్టికరిపించాడు. పాపం.. సినర్! మూడు మ్యాచ్ పాయింట్లపై నిలిచి మరీ భంగపడ్డాడు. తన ఓటమి ఖాయమని అంతా భావించిన వేళ.. అల్కరాస్ పుంజుకున్న తీరు అపూర్వం.

అద్భుతమైన ఆటతో కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. ఆదివారం రసవత్తరంగా సాగిన ఫైనల్లో అతడు 4-6, 6-7 (4-7), 6-4, 7-6 (7-3), 7-6 (10-2)తో టాప్ సీడ్ యానిక్ సినర్ (ఇటలీ)పై చిరస్మరణీయ విజయం సాధించాడు. తొలి రెండు సెట్లు కోల్పోయాక, నాలుగో సెట్లో 3-5 (0-40)తో నిలిచాక ఇక ఓటమి తప్పదనే స్థితిలో నిలిచాక అల్కరాస్ పుంజుకున్న తీరు స్ఫూర్తిదాయకం. 5 గంటల 29 నిమిషాల పాటు సాగిన ఈ ఫైనల్.. రొలాండ్ గారోస్ చరిత్రలో అత్యంత సుదీర్ఘమైన ఫైనల్‌గా రికార్డులకెక్కింది. కెరీర్‌లో అల్కరాస్‌కు ఇది అయిదో గ్రాండ్‌స్లామ్ టైటిల్. అతడికిది రెండో ఫ్రెంచ్ ఓపెన్ ట్రోఫీ. సినర్ జోరు: ఇద్దరూ గట్టిగా పోరాడడంతో తొలి సెట్ హోరాహోరీగా సాగింది. మూడో గేమ్‌లో బ్రేక్ సాధించేందుకు అల్కరాస్‌కు చక్కని అవకాశం చిక్కింది. కానీ 15-40తో వెనుకబడ్డా.. సినర్ బలంగా పుంజుకుని సర్వీసును నిలబెట్టుకున్నాడు. కానీ అల్కరాస్ అయిదో గేమ్‌లో బ్రేక్‌తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అయితే అతడి ఆనందాన్ని సినర్ ఎంతో సేపు నిలునివ్వలేదు. తర్వాతి గేమ్‌లోనే బ్రేక్ సాధించి స్కోరు సమం చేశాడు. ప్రతి పాయింట్ కోసం ఇద్దరూ హోరాహోరీగా తలపడుతుండడంతో మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ఇద్దరూ 4-4తో సమంగా నిలిచారు. తొమ్మిదో గేమ్‌లో అలవోకగా సర్వీసు నిలబెట్టుకున్న సినర్ 5-4తో నిలిచాడు. కీలకమైన తొమ్మిదో గేమ్‌లో అల్కరాస్ తడబడ్డాడు. అతడి సర్వీసును బ్రేక్ చేసిన సినర్ సెట్‌ను చేజిక్కించుకున్నాడు. అంతకు కొద్దిసేపు ముందు కుడి కంట్లో ఏదో సమస్య తలెత్తడం అల్కరాస్ లయను దెబ్బతీనట్లుగా కనిపించింది. రెండో సెట్లోనూ సినర్ పైచేయిని కొనసాగించాడు. రెండో గేమ్‌లోనే బ్రేక్ సాధించిన అతడు.. తర్వాత సర్వీసు నిలబెట్టుకుని 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆ తర్వాత 5-3తో నిలిచాడు. కానీ కీలక సమయంలో అల్కరాస్ పుంజుకున్నాడు. సెట్ కోసం సినర్ సర్వ్ చేయగా.. అల్కరాస్ బ్రేక్ చేశాడు. ఆ తర్వాత సర్వీసు నిలబెట్టుకుని 5-5తో సమంగా నిలిచాడు. క్రమంగా సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. అక్కడ పైచేయి సాధించిన సినర్.. రెండో సెట్‌ను కూడా కైవసం చేసుకున్నాడు. అయితే వరుస సెట్లలో మ్యాచ్‌ను కోల్పోయే ప్రమాదంలో పడ్డ అల్కరాస్ మ్యాచ్‌లో అద్భుతంగా పుంజుకున్నాడు. మూడో సెట్ కూడా ఆటగాళ్ల పరస్పర బ్రేకులతో ఆసక్తికరంగా సాగింది. కానీ పూర్తి భిన్నంగా కనిపించిన అల్కరాస్.. ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. తొలి గేమ్‌లోనే సర్వీసు చేజార్చుకున్నా కోలుకున్న అతడు.. రెండు, నాలుగో గేముల్లో బ్రేకులతో 4-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అల్కరాస్ అలవోకగానే సెట్ సొంతం చేసుకుంటాడని భావించారంతా. కానీ సెట్ కోసం సర్వ్ చేస్తూ 9వ గేమ్‌లో సర్వీసు కోల్పోయాడు. కానీ తర్వాతి గేమ్‌లోనే బ్రేక్ సాధించిన అల్కరాస్.. సెట్‌ను గెలుచుకుని, మ్యాచ్‌లో ఆశలను సజీవంగా ఉంచుకున్నాడు.

ఓటమి అంచుల్లో నుంచి..: మూడో సెట్ వైఫల్యం నుంచి కోలుకున్న సినర్.. నాలుగో సెట్లో దూసుకుపోయాడు. ఆటగాళ్లిద్దరూ నువ్వా నేనా అన్నట్లు తలపడడంతో ఏడో గేమ్ వరకు సెట్ ఎలాంటి బ్రేక్ లేకుండా సాగింది. కానీ ఏడో గేమ్‌లో బ్రేక్ సాధించిన సినర్, ఆ వెంటనే సర్వీసు నిలబెట్టుకుని పట్టుబిగించాడు. ఆపై 9వ గేమ్‌లో అల్కరాస్ సర్వీసు చేస్తుండగా సినర్ 40-0తో నిలిచాడు. ఇక ఒక్క పాయింటు సాధిస్తే ఖాతాలో టైటిల్. కానీ కథ అక్కడే అనూహ్యంగా మలుపు తిరిగింది. అల్కరాస్ అద్భుతమే చేశాడు. గొప్ప పోరాటంతో మూడు ఛాంపియన్‌షిప్ పాయింట్లను కాచుకున్న అతడు.. ఆ వెంటనే సినర్ సర్వీసును బ్రేక్ చేసి స్కోరును 5-5తో సమం చేశాడు. సెట్ చివరికి టైబ్రేక్‌కు దారితీసింది. అక్కడ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన అల్కరాస్.. సెట్ గెలిచి, మ్యాచ్‌ను నిర్ణయాత్మక సెట్‌కు తీసుకెళ్లాడు. ఆఖరి సెట్ కూడా నువ్వానేనా అన్నట్లు సాగింది. ఇద్దరూ 6-6తో నిలవడంతో ఆట సూపర్ టై బ్రేక్‌కు దారితీసింది. ఒత్తిడిని తట్టుకుంటూ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి అల్కరాస్.. టైబ్రేక్‌లో 10-2తో నెగ్గి, విజేతగా నిలిచాడు. లేటు వయసులో..: వెటరన్ ఆటగాళ్లు మార్సెల్ గ్రానోలర్స్ (స్పెయిన్), హొరాసియో జెబలోస్ (అర్జెంటీనా) లేటు వయసులో అదరగొట్టారు. అదిరే ఆటతో ఈ జోడీ ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. 39 ఏళ్ల గ్రానోలర్స్, 40 ఏళ్ల జెబలోస్ జంటగా నాలుగో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడారు. కానీ ఫ్రెంచ్ టైటిల్ నెగ్గడం మాత్రం ఇదే తొలిసారి. ఫైనల్లో ఈ జోడీ 6-0, 6-7 (5), 7-5తో బ్రిటన్‌కు చెందిన జో సలిస్‌బరీ, నీల్ స్కుప్‌స్కీ జంటపై విజయం సాధించింది. మహిళల డబుల్స్‌లో సారా ఎరాని, జాస్మిన్ పావోలిని ద్వయం టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో ఈ రెండో సీడ్ ఇటలీ జోడీ 6-4, 2-6, 6-1తో అనా దనిలినా (కజకిస్థాన్), అలెగ్జాండ్రా క్రునిచ్ (సెర్బియా) జంటను ఓడించింది. అల్కరాస్-సినర్ మధ్య మ్యాచ్ ఫ్రెంచ్ ఓపెన్ చరిత్రలో సుదీర్ఘంగా సాగిన (5 గంటల 29 నిమిషాలు) సింగిల్స్ ఫైనల్‌గా నిలిచింది. 1982లో మాట్స్ విలాండర్-విలాస్ (4 గంటల 42 నిమిషాలు) నెలకొల్పిన రికార్డు కనుమరుగైంది.

నాదల్, గుస్తావో కుయెర్టన్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్‌ను నిలబెట్టుకున్న ఘనత అల్కరాస్‌దే.

అల్కరాస్‌కు ఇది అయిదో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్. ఇంతకుముందు అతను 2023, 2024 వింబుల్డన్, 2024 ఫ్రెంచ్ ఓపెన్, 2022 యుఎస్ ఓపెన్ టైటిళ్లు సాధించాడు.



ప్రభాత సూర్యుడు
సోమవారం - 09 - జూన్ - 2025

# సినిమా చిత్రం

## 'మిరాయ్' టీజర్.. గూస్ బంప్స్ పక్కా..




హనుమాన్ మూవీతో టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా ఎలాంటి గుర్తింపు సంపాదించుకున్నారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మిరాయ్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. సూపర్ యోధగా సినిమాలో కనిపించనున్నారు. అయితే అనౌన్స్మెంట్ నుంచే మూవీపై ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న మిరాయ్ మూవీలో రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తున్నారు. మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 5వ తేదీన విడుదల కానున్న మిరాయ్ మూవీపై ఇప్పటికే ఆడియన్స్ మంచి హోప్స్ పెట్టుకున్నారు. ఇప్పటికే సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు, స్పెషల్ గ్లింప్స్ లు సూపర్ రెస్పాన్స్ అందుకున్నాయి. తాజాగా మోస్ట్ అవైటెడ్ టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. జరబోయేది మారణహోమం.. శిథిలం కాబోతుంది అశోకుడి ఆశయం.. కలియుగంలో పుట్టిన ఏ శక్తి దీన్ని ఆపలేదు అంటూ జయరాం డైలాగ్ తో టీజర్ గ్రాండ్ గా మొదలైంది. ఆ తర్వాత మంచు మనోజ్ ఎంట్రీ ఇచ్చారు. ఇట్స్ మై టర్న్ అంటూ ఆసక్తి రేపారు. శ్రియ కీలక పాత్రలో కనిపించారు. ఇంతలో యోధగా తేజ.. తొమ్మిది పుస్తకాలు.. 100 ప్రశ్నలు.. ఒక స్టిక్.. బిగ్ అడ్వెంచర్ అంటూ టీజర్ ను మరో రేంజ్ లోకి తీసుకెళ్లారు. ఓవరాల్ గా టీజర్.. గూస్ బంప్స్ తెప్పిస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. డిస్ట్రిబ్యూటర్ ఫుల్ ఫైర్ ఏదేమైనా మిరాయ్ టీజర్ మాత్రం ఊహించని రతిలో ఉంది. మంచు మనోజ్, తేజ సజ్జా నటన అదిరిపోయింది. గౌర హరి అందించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ అయితే వేరే లెవెల్. టీజర్ లోని విజువల్స్ అయితే హాలీవుడ్ మూవీని తలపించినట్లు ఉన్నాయి. చివర్లో రాముని రాకపై చూపించిన విజువల్ ఊహించని రీతిలో ఉందనే చెప్పాలి. ముఖ్యంగా నిర్మాతల రిచ్ వాల్యూస్ క్లియర్ గా కనిపిస్తున్నాయి. అద్భుతంగా ఉన్నాయి. మంచు మనోజ్, తేజ సజ్జా యాక్షన్ సీన్స్ లో ఎక్కడా అస్సలు కాంప్రమైజ్ అయినట్లు లేదు. ప్రతీ విషయంలో డైరెక్టర్ జాగ్రత్తలు తీసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. రితికా నాయక్ స్క్రీన్ ప్రెజెన్స్ కూడా బాగుంది. అలా టీజర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటూ.. మెప్పిస్తూ.. దూసుకుపోతోంది. మూవీ బ్లాక్ బస్టర్ అనే నమ్మకం క్రియేట్ చేస్తోంది.

## విశ్వంభర అదంత ఈజీ కాదంతే..?



మెగాస్టార్ చిరంజీవి వశిష్ట కాంబినేషన్ లో వస్తున్న విశ్వంభర సినిమా త్వరలో రిలీజ్ కాబోతుంది. యువి క్రియేషన్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో ఈ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా ఎం.ఎం కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఐతే ఈ సినిమాను అసలైతే ఈ సంక్రాంతికే రిలీజ్ చేయాలని అనుకున్నారు కానీ అది కుదరలేదు. సమ్మర్ కైనా వస్తుందనుకున్న మెగా ఫ్యాన్స్ కి నిరాశ తప్పలేదు. మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే కానుకగా విశ్వంభర రిలీజ్ ఉంటుందని అంటున్నారు. అది కూడా అఫీషియల్ గా చెప్పలేదు. ఐతే విశ్వంభర సినిమా గ్రాఫిక్స్ కి ఎక్కువ టైం తీసుకుంటున్నారని తెలుస్తుంది. సినిమాలో వి.ఎఫ్.ఎక్స్ వర్క్ సినిమాకు చాలా ఇంపార్టెంట్ అనే కారణంతోనే కాస్త ఎక్కువ ఫోకస్ తో ఆ పనులు చేస్తున్నారట. ఐతే ఈమధ్య గ్రాఫిక్స్ తో కూడిన సినిమాల విషయంలో కూడా ఆడియన్స్ చాలా అబ్జర్వేట్ చేస్తున్నారు. ముఖ్యంగా హాలీవుడ్ సినిమాల్లో గ్రాఫిక్స్ ని కూడా చూసే వెసులు బాటు ఉంది కాబట్టి కచ్చితంగా విశ్వంభర సినిమాను వాటితో పోల్చే ఛాన్స్ ఉంటుంది. మరి విశ్వంభర టీం ఆ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు అన్నది చూడాలి. మెగాస్టార్ చిరంజీవి జగదేక వీరుడు అతిలోకసుందరి సినిమా రేంజ్ లో విశ్వంభర ని తెరకెక్కిస్తున్నారు. ఐతే ఈ సినిమా వచ్చి 30 ఏళ్ల పైన అవుతుంది సో ఇప్పుడు విశ్వంభరతో నెక్స్ట్ లెవెల్ టార్గెట్ పెట్టారని తెలుస్తుంది. డిస్ట్రిబ్యూటర్ ఫుల్ ఫైర్ మెగాస్టార్ చిరంజీవి కూడా విశ్వంభర సినిమా మీద చాలా హోప్స్ తో ఉన్నట్టు అనిపిస్తుంది. ఈ సినిమా ఆయన పార్ట్ పూర్తి కాగా నెక్స్ట్ చేస్తున్న అనిల్ రావిపూడి సినిమా షూటింగ్ లో పాల్గొంటున్నారు చిరు. ఐతే విశ్వంభర రిలీజ్ ఎప్పుడు సినిమా ప్రమోషన్స్ ఎప్పుడు మొదలు పెడతారు అన్నది తెలియాల్సి ఉంది. త్రిష తో పాటు ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, ఆషిక రంగనాథ్ లు కూడా ఇంపార్టెంట్ రోల్స్ లో నటిస్తున్నారని తెలుస్తుంది. విశ్వంభర సినిమా మరోసారి ఆడియన్స్ కి ఒక సూపర్ విజువల్ ట్రీట్ ఇచ్చేందుకు రాబోతుంది. ఈ సినిమాపై ఉన్న అంచనాలను అందుకుంటే మాత్రం పాన్ ఇండియా లెవెల్ లో సంచల నాలు క్రియేట్ చేస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## దీపికా రిజెక్ట్ చేసిన సినిమాలివే



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్ లో తెరకెక్కనున్న భారీ బడ్జెట్ సినిమా స్పిరిట్. అనౌన్స్మెంట్ తోనే భారీ అంచనాలు సాధించిన ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్ పైకి వెళ్తుందా అని డార్లింగ్ ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె హీరోయిన్ గా నటిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ తర్వాత కొన్ని కారణాల వల్ల ఆమె ప్రాజెక్టు నుంచి తప్పుకుందని కొంద రంటుంటే, మరికొందరు కావాలనే దీపికాను స్పిరిట్ నుంచి తప్పించారని అన్నారు. కారణా లేవైనా సరే దీపికా మాత్రం స్పిరిట్ లో నటిం చడం లేదు. సందీప్ రెడ్డి దర్శకత్వంలో ప్రభాస్ పక్కన దీపికా నటిస్తే బావుంటుందని ఆయన ఫ్యాన్స్ ఎంతో ఆశపడ్డారు కానీ ఆ ఛాన్స్ ను దీపికా మిస్ చేసుకుంది. డిస్ట్రిబ్యూటర్ ఫుల్ ఫైర్ అయితే దీపికా ఇన్నేళ్ల తన కెరీర్లో వివిధ కారణాలతో కొన్ని సినిమాలను మిస్ చేసుకుంది. అలా అమ్మడు మిస్ చేసుకున్న సినిమాల్లో కొన్ని సినిమాలు సూపర్ హిట్లు కాగా మరికొన్ని యావరేజ్ గా నిలిచాయి. అయితే దీపిక చేయలేక నో చెప్పిన సినిమాల లిస్ట్ కాస్త పెద్దగానే ఉంది. మరి లిస్ట్ ఏంటి? వాటిలో బ్లాక్ బస్టర్ గా నిలిచిన సినిమాలేంటన్నది చూద్దాం. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 2022లో తెరకెక్కిన గంగూబాయి కథియావాడి సినిమా ఆఫర్ ముందుగా దీపికాకే వచ్చిందట. కానీ అప్పుడు కొన్ని కారణాల వల్ల దీపికా ఆ సినిమాను చేయలేకపోయింది. దీంతో ఆ ఛాన్స్ అలియా భట్ కు వెళ్లింది. ఆ సినిమాలో తన నటనకు అలియా ఏకంగా నేషనల్ అవార్డును కూడా అందుకుందనే విషయం తెలిసిందే. ఇక రణ్‌బీర్ కపూర్ హీరోగా 2011లో వచ్చిన రాక్‌స్టార్ సినిమాను కూడా దీపికా చేయాల్సింది. దీపికా ముందుగా ఈ సినిమాను చేద్దామనుకున్నప్పటికీ ఆ తర్వాత కాల్షీట్స్ కుదరకపోవడంతో ఒప్పుకోలేకపోయింది. ఈ సినిమా కూడా సూపర్ హిట్ గా నిలిచింది. 2016లో వచ్చిన సుల్తాన్ సినిమా ఆఫర్ కూడా ముందు దీపికాకే వెళ్లింది కానీ వేరే ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల సుల్తాన్ ను చేయలేకపోయింది దీపికా. 2015లో వచ్చి ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్7లో కూడా దీపికా యాక్ట్ చేయాల్సింది. కానీ అదే టైమ్ లో దీపికా రామ్ లీలా సినిమా చేస్తున్నందునఈ సినిమాను రిజెక్ట్ చేసింది. ఈ సినిమా కూడా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. 2013లో ధూమ్3 సినిమాలో ఆఫర్ వచ్చినప్పటికీ ఆ టైమ్ లో తన డేట్స్ ఖాళీగా లేకపోవడంతో దాన్ని మిస్ చేసుకుంది. ఇక జబ్ తక్ హై జాన్ సినిమాలో కోసం కూడా ముందుగా దీపికానే అప్రోచ్ అయ్యారట. ఆమె రిజెక్ట్ చెయ్యడంతోనే ఆ ఛాన్స్ కత్రినా కైఫ్ కు వెళ్లింది.

## 'కుబేర' బిగ్ అప్‌డేట్ వచ్చింది చూశారా..!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, తెలుగు స్టార్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబోలో రూపొందిన సినిమా 'కుబేర'. ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్రలో నటించగా, రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించడంతో టాలీవుడ్‌లోనూ అంచనాలు భారీగా ఉన్నాయి. తమిళ్‌తో పాటు, తెలుగులో ఏక కాలంలో రూపొందిన కుబేర సినిమాను జూన్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. కుబేర సినిమా ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. నాగార్జున పాత్రతో పాటు ధనుష్ పాత్రపై ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇద్దరి మధ్య ఉండే సంబంధం, ఇద్దరిని కలిపే పరిస్థితులు చాలా ఆసక్తిగా ఉంటాయని ట్రైలర్ ను చూస్తే అనిపిస్తుంది అంటూ ప్రేక్షకులు కామెంట్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో చాలా కాలం క్రితమే ఆడియో విడుదల కార్యక్రమాలు కాల గర్భంలో కలిసి పోయాయి. కానీ తమిళనాట ఇంకా ఆడియో విడుదల కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉండే ప్రీ రిలీజ్ ఈవెంట్‌లు కోలీవుడ్‌లో ఉండవు. అందుకే కుబేర సినిమాకు చెన్నైలో భారీ ఎత్తున ఆడియో విడుదల కార్యక్రమం ను నిర్వహించేందుకు గాను ఏర్పాట్లు జరిగాయి. కుబేర సినిమా ఆడియో విడుదలకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చింది. జూన్ 1 న చెన్నైలోని శ్రీ సాయిరామ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లియో ముత్తు ఇండోర్ స్టేడియంలో ఈ బిగ్ ఈవెంట్‌ను చేయబోతున్నారు. తెలుగు ఈవెంట్ సంస్థ అయిన శ్రేయాస్ మీడియ ఈ ఆడియో విడుదల కార్యక్రమం ను నిర్వహించనుంది. కుబేర ఆడియో విడుదల కార్యక్రమంకు నాగార్జున హాజరు అయ్యే అవకాశాలు ఉన్నాయి. అంతే కాకుండా రష్మిక మందన్న సైతం పాల్గొంటుందని తెలుస్తోంది. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ముగ్గురు ఆడియో విడుదల కార్యక్రమంలో పాల్గొంటే కచ్చితంగా బిగ్ సక్సెస్ కావడం ఖాయం. ధనుష్ ఫ్యాన్స్ ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ధనుష్ తెలుగు దర్శకుడితో కలిసి చేస్తున్న రెండో సినిమా ఇది. కనుక ఆయన అభిమానులతో పాటు, తెలుగు ప్రేక్షకుల్లోనూ అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమాను రూపొందించారని ట్రైలర్‌ను చూస్తే అర్థం అవుతుంది. డిస్ట్రిబ్యూటర్ ఫుల్ ఫైర్ సాధారణంగా ధనుష్ సినిమాలు చాలా స్పీడ్‌గా రూపొందుతూ ఉంటాయి. కానీ కుబేరా సినిమాకు ఎక్కువ సమయం తీసుకున్నాడు. దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్‌కి ఏడాది సమయం తీసుకున్నాడు. అలాగే సినిమా షూటింగ్‌కి సైతం ఎక్కువ సమయం తీసుకున్నాడు. దాంతో ఈ సినిమా ప్రకటించినప్పటి ఇప్పటి వరకు దాదాపు రెండేళ్ల సమయం పట్టింది. ధనుష్ ఫ్యాన్స్ మాత్రమే అన్ని వర్గాల వారిని మెప్పించే విధంగా కుబేరా సినిమా ఉండే అవకాశాలు ఉన్నాయి. కుబేర సినిమాతో పాటు ధనుష్ మరో రెండు సినిమాలతో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందులో ధనుష్ సొంత దర్శకత్వంలో సినిమా కూడా ఉండబోతుంది.

## 'సలార్' మళ్లీ నెం.1... ఇదే సాక్ష్యం



హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన 'సలార్' సినిమా 2023 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కేజీఎఫ్ సినిమా సూపర్ హిట్ నేపథ్యంలో సలార్ సినిమాపై మొదటి నుంచి అంచనాలు భారీగా పెరిగాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సలార్ సినిమాను భారీ యాక్షన్ సన్నివేశాలతో ప్రశాంత్ నీల్ రూపొందించాడు. ప్రభాస్ ఫ్యాన్స్ మాత్రమే కాకుండా అన్ని భాషల్లోనూ యాక్షన్ సినిమాలను ఇష్టపడే వారు ఈ సినిమాను తెగ ఆధరించారు. దాంతో థియేట్రికల్ రిలీజ్ అయ్యి దాదాపుగా వెయ్యి కోట్ల వసూళ్లు రాబట్టగా, ఓటీటీ స్ట్రీమింగ్‌లో ఎన్నో రికార్డ్‌లను ఈ సినిమా దక్కించుకుని అరుదైన సినిమాగా నిలిచింది. సాధారణంగా అన్ని సినిమాలు ఒకటి లేదా రెండు ఓటీటీల్లో మాత్రమే స్ట్రీమింగ్ అవుతూ ఉంటాయి. కానీ ఈ సినిమా ఏకంగా ఏడు ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లో స్ట్రీమింగ్ అయింది. థియేట్రికల్ రిలీజ్ అయిన నెల రోజుల తర్వాత ఓటీటీ స్ట్రీమింగ్ మొదలు పెట్టిన సలార్ అన్ని భాషల్లోనూ విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ మధ్య కాలంలో ఓటీటీ ప్లాట్ ఫామ్స్ ఎక్కువగా ఆన్‌డ్రాయిడ్ టీవీల్లో వాడుతూ ఉన్నారు. మొబైల్‌లో ఓటీటీలను వినియోగించడం కాస్త తక్కువే అని చెప్పాలి. అయితే సలార్ సినిమా మొబైల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో అత్యధికంగా చూడబడిన సినిమాగా నిలిచింది అంటూ నిల్సన్ అనే సంస్థ సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, జియో హాట్ స్టార్, సోనీ లివ్, జీ5, ఎంఎక్స్ ప్లేయర్ ఇలా పలు భాషల్లో వివిధ భాషల్లో సలార్ అందుబాటులో ఉంది. లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణాల్లో 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్కులు మొబైల్ ద్వారా సలార్ సినిమాను చూసినట్లుగా నిల్సన్ సర్వేలో వెల్లడి అయింది. మొబైల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ ల్లో ఎక్కువగా వెబ్ సిరీస్‌లను చూస్తూ ఉంటారని, ఆ తర్వాత ఇంగ్లీష్ వెబ్ సిరీస్‌లను చూస్తూ ఉంటారు. కానీ మార్చి 2025 లెక్కల ప్రకారం సలార్ సినిమాను మొబైల్ స్క్రీన్ పై అత్యధికులు చూశారని వెల్లడి అయింది. ప్రభాస్ అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రముఖంగా షేర్ చేస్తూ సందడి చేస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్ ఫుల్ ఫైర్ సలార్ సినిమా పార్ట్ 1 లో మిగిలి ఉన్న ప్రశ్నలకు పార్ట్ 2 లో సమాధానం చెప్పాల్సి ఉంది. ఎన్నో ప్రశ్నాలకు ప్రశాంత్ నీల్ సలార్ 2 లో సమాధానం ఇస్తాడని అభిమానులు, సినీ ప్రేమికులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్ సినిమాతో బిజీగా ఉన్నాడు. దాంతో ప్రభాస్, ప్రశాంత్ నీల్ కాంబో 'సలార్ 2' ఎప్పుడు మళ్లీ సెట్స్ పైకి వెళ్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మెజార్టీ పార్ట్ షూటింగ్ పూర్తి చేసి ఉంటాడని కొందరు అంటూ ఉంటే, సలార్ 2 సినిమా షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదని కొందరు అంటున్నారు. మొత్తానికి సలార్ విడుదలై దాదాపు రెండేళ్లు కావస్తున్నా వార్తల్లో నిలుస్తూనే ఉంది.



## జైలర్2లో బాలీవుడ్ సీనియర్ హీరోయిన్?

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ ఏడు పదుల వయసులో కూడా ఫుల్ యాక్టివ్ గా సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం సౌత్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ సినిమా చేస్తున్నారు రజినీకాంత్. ఇప్పటికే ఆ సినిమాకు సంబంధించిన షూటింగ్ ను పూర్తి చేసిన రజినీకాంత్ తన తర్వాతి సినిమాను జైలర్ ఫేమ్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. జైలర్ సినిమాతో రజినీకాంత్ సృష్టించిన అల్లకల్లోలం మామూలుది కాదు. సినిమాలో తన వయసుకి తగ్గ పాత్ర పోషించి అందరినీ ఆకట్టుకున్న రజినీకాంత్ ఆ సినిమాతో తన కెరీర్ బెస్ట్ హిట్స్ లో ఒకటిగా జైలర్ ను నిలిపారు. అలాంటి జైలర్ కు సీక్వెల్ గా ఇప్పుడు జైలర్2 వస్తోంది. ఈ సినిమా స్క్రిప్ట్ పై డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ గత కొంతకాలంగా వర్క్ చేస్తున్నాడు. మొన్నా మధ్య అనౌన్స్ అయిన ఈ సినిమాకు ఆల్రెడీ యాక్టర్ల ఎంపిక కూడా స్టార్ట్ అయింది. ఈ సినిమాలో రజినీకాంత్ సరసన విద్యాబాలన్ ను ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. జైలర్1లో రజినీకి భార్యగా రమ్యకృష్ణ కనిపించగా, ఇప్పుడు ఆయన పక్కన విద్యా బాలన్ ను ఎందుకు తీసుకుంటున్నారనేది ఇంట్రెస్టింగ్ గా మారింది. జైలర్ లో ఎలాగైతే శివరాజ్ కుమార్, మోహన్ లాల్, జాకీ ష్రాఫ్ గెస్ట్ రోల్స్ లో కనిపించారో, ఇప్పుడు జైలర్2 లో కూడా అలానే సర్ప్రైజింగ్ రోల్స్ ఉంటాయని అంటున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో నందమూరి బాలయ్య ఓ గెస్ట్ రోల్ లో కనిపించనున్నాడనే వార్త బయటికొచ్చింది. తాజాగా కింగ్ నాగార్జున జైలర్2లో విలన్ గా కనిపించబోతున్నాడని అంటున్నారు. కూలీలో ఇప్పటికే రజినీతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్న నాగ్, ఇప్పుడు మరోసారి జైలర్2 లో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నాడట.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail: prabhathasuryudunewsdesk@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555